

ఇది శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో గల పరిపాలన కార్యాలయంలోని వీసీ పీఏ విభాగం. గురువారం ఉదయం 10:24 గంటలైనా పీఏ సీటు ఖాళీగానే ఉంది. లోపల గదిలో ముగ్గురు సిబ్బంది తమ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. వీసీ పీఏ రాలేదా అని 'ఆంధ్రజ్యోతి' అడగ్గా.. రాలేదనే సమాధానం సంబంధిత ఉద్యోగుల నుంచి వినిపించింది. వాస్తవానికి వీసీ తన చాంబర్‌కు రాకమునుపే పీఏ రావాల్సి ఉంటుంది. ఎవరైనా వీసీకోసం వచ్చినా.. సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఇక్కడ మాత్రం ఆ పరిస్థితి కనిపించట్లేదు. ఈ గది ఎదురుగానే వీసీ చాంబర్ ఉంది. ఉదయం 10.30 గంటలు అవుతున్నా.. చాంబర్ తలుపులు తెరవకపోవడం గమనార్హం.



ఎస్కేయూ పరిపాలన విభాగ భవనం

రాయల విద్యాలయం

పాలన అధ్వానం!

ఎస్కేయూ పరిపాలన కార్యాలయంలో ఇష్టారాజ్యం

- సమయపాలన పాటించని ఉద్యోగులు
- ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్న వైనం
- అన్ని విభాగాల్లో అదే పరిస్థితి

అనంతపురం రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు అంటే పరిపాలన దక్షతకు మారుపేరు. శతాబ్దాల క్రితమే లెక్కలేనన్ని చెరువులు తవ్వి అభివృద్ధి అంటే ఏంటో చూపించారు. అలాంటి గొప్ప చక్రవర్తి పేరుతో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. పాలనాదక్షతకు మారుపేరైన రాయల పేరు పెట్టిన వర్సిటీలోనే పరిపాలన అధ్వానంగా తయారైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సమయపాలన కరువైంది. కీలకమైన పరిపాలన కార్యాలయంలోనే విధుల సమయానికి వచ్చే అధికారి, ఉద్యోగి లేరు. 'ఆంధ్రజ్యోతి' గురువారం చేపట్టిన విజిట్‌లో ఈ విషయం తేటతెల్లమైంది. ఉదయం 10.24 గంటల సమయంలో పరిపాలన కార్యాలంలోని ఏ విభాగానికెళ్లినా ఖాళీ కుర్చీలే స్వాగతమిచ్చాయి. ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఏ ఒక్కరూ కనిపించలేదు. కొన్ని విభాగాల్లో ఖాళీ కుర్చీలు చల్లగుండాలని ఫ్యాన్లు, లైట్లు వేసి వదిలేశారు.

అన్ని విభాగాల్లో అంతే..

కార్యాలయంలోని సెంట్రల్ స్టోర్స్, మెయింటెనెన్స్, స్టాటిస్టికల్-ఇన్ఫర్మేషన్ బ్యూరో (టీఎఫ్‌టీ), ఇంజనీరింగ్, ఆడిట్, కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఇలా పదుల సంఖ్యలో విభాగాలున్నాయి. ఆయా విభాగాల్లో కిందిస్థాయి సిబ్బంది ఒకరిద్దరు కనిపించారు. కొన్ని విభాగాల్లో అధికారులు, ఉద్యోగులు ఏమాత్రం కనిపించలేదు. వారు ఎక్కడికెళ్లారు, ఎప్పుడొస్తారని సిబ్బంది చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఉదయం 10 గంటలకు ఉద్యోగులు విధుల్లో ఉండాలి. కార్యాలయంలో మాత్రం 10.30 గంటలు దాటినా ఖాళీ కుర్చీలే కనిపించడం గమనార్హం. ఉన్నతాధికారులే రాలేదు. వారే రానపుడు తమకేమిలే అనుకున్నారో.. ఏమోగానీ.. ఉద్యోగులు, సిబ్బంది కూడా లేరు.



ఇది పరిపాలన కార్యాలయంలోని స్టాటిస్టికల్, ఇన్ఫర్మేషన్ బ్యూరో (టీఎఫ్‌టీ) విభాగం. తెలుపులు తెరుచుకున్నాయే తప్ప.. అందులో ఒక్క ఉద్యోగి కూడా కనిపించలేదు. కుర్చీలన్నీ ఖాళీగానే కనిపించాయి. ఒక్కరంటే ఒక్క ఉద్యోగి కూడా కుర్చీలో లేకపోవడం ఇక్కడి ఉద్యోగుల పనితీరుకు నిదర్శనం.



ఇది పరిపాలన కార్యాలయంలోని సెంట్రల్ స్టోర్స్, మెయింటెనెన్స్ విభాగం. ఇక్కడ కూడా ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. 10:26 గంటలైనా ఒక్క ఉద్యోగి కూడా కనిపించలేదు. సిబ్బంది విభాగ తలుపులు తెరిచి, ఫ్యాన్లు, లైట్లు వేసి, గది చల్లగా ఉండాలని వదిలేశారు.

నిద్రలో నిఘా..!

వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలు

పోలీసులకు సవాల్‌గా మారిన దొంగలు



చోరీ జరిగిన టీ కొట్టు

కదిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): వరుసగా జరుగుతున్న దొంగతనాలు పట్టణ ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. శివారు ప్రాంతాలే లక్ష్యంగా దొంగలు రెచ్చిపోతున్నారు. నెలన్నరలోపే పట్టణంలో రెండు భారీ దొంగతనాలు జరిగాయి. పెద్ద మొత్తంలో బంగారం చోరీ చేశారు. పోలీసుల నిఘా, గస్తీ కొరవడటంతోనే చోరీలు జరుగుతున్నాయని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. ఈక్రమంలో ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాలంటేనే ప్రజలు జంకే పరిస్థితి ఏర్పడింది. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారితో ఫిర్యాదు తీసుకోవడం, కేసులు నమోదు చేయడమే పోలీసులు పనిగా పెట్టుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రెండు భారీ చోరీలు

కదిరిలో నెలన్నరలోపే రెండు భారీ దొంగతనాలు జరిగాయి. కిటికీ ఊచలను కట్ చేసి, ఇంట్లోకి చొరబడి సొమ్మంత దోచుకెళ్లారు. దొంగతనాలు జరిగినా ప్రతిసారి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో పరిశీలించడం తప్ప గస్తీ పెంచింది లేదనే విమర్శలు పోలీసులపై ఉన్నాయి. గత నెల ఒకటిన వైశ్యాబ్యాంక్ కాలనీలో ఓ అధ్యాపకురాలు రాత్రి ఇంటిలో నిద్రపోతుండగా బెడ్‌రూం కిటికీ తొలగించి ఇంట్లోకి చొరపడ్డారు. ఇంట్లో ఉన్న 10 తులాల బంగారం, నాలుగు కిలోల వెండి, లక్ష రూపాయల నగదు దోచుకెళ్లారు. ఈనెల ఆరో తేదీ రాత్రి రాయచోటి రోడ్డుకు సమీపంలోని నారాయణరెడ్డి వీధిలోని నరసారెడ్డి ఇంటికి తాళం వేసి ఉండటంతో కిటికీని తొలగించి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న 17తులాల బంగారం చోరీ చేశారు. మే12న జీవిమానుకు సమీపంలో ఉన్న ఇంటిలో మూడు తులాల బంగారం, రూ. 30 వేలు డబ్బు చోరీ చేశారు. మే10న నల్లగుట్ట వీధిలో ఓ ఇంటిలో 5 తులాల బంగారం, రూ.80వేలు ఎత్తు కెళ్లారు. జూన్ 7న బస్టాండులో దిగిన గాలివీడుకు చెందిన మహిళ పర్సును కొట్టేశారు. అందులో ఏడు తులాల బంగారు ఉన్నట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. జరుగుతున్న దొంగతనాలను గమనిస్తే దొంగలు శివారు ప్రాంతాలను ఎంచుకొని, రెక్కి నిర్వహించి, చోరీలకు (మిగతా 6లో..)

మా పాలనలో రెండింతల అభివృద్ధి

రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ (7లో..)



ఘర్షణ పడుతున్న తెలుగు తమ్ముళ్లు

డిష్యుం.. డిష్యుం..!

- శింగనమలలో తమ్ముళ్ల తన్నులాట
- మండల కన్వీనర్ పదవి కోసం పోటీ



పోలీసులతో మాట్లాడుతున్న మారుతీ నాయుడు, సమావేశంలో ప్రసంగిస్తున్న వేలూరు రంగయ్య

శింగనమల, జూలై 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కన్వీనర్ పదవి కోసం పార్టీలోని సీనియర్లు.. జూనియర్లు గొడవకు దిగారు. మాటా మాటా పెరిగి పిడిగుద్దులు గుద్దుకున్నారు. ఇరువర్గాలవారు ఈలలు కేకలు వేస్తూ రచ్చ రచ్చ చేశారు. వీరి గొడవతో శింగనమలలో శుక్రవారం ఉద్రిక్తత ఏర్పడింది. టీడీపీ గ్రామ, మండల కమిటీల ఏర్పాటు కోసం శుక్రవారం పట్టణంలోని దుర్గాంజనేయస్వామి దేవాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు వేలూరు రంగయ్య హాజరయ్యారు. మండల కమిటీకి తీవ్ర పోటీ ఉందని ఆయన అన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికే మండల కన్వీనర్ పదవి ఇవ్వడానికి అధినాయకత్వం మొగ్గు చూపుతోందని తెలిపారు. మండల కన్వీనర్ పదవి కోసం 20 మంది పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. ఏకాభిప్రాయం కుదరలేదని, అందుకే 20 మంది పేర్లను అధినాయకత్వానికి పంపుతున్నామని అన్నారు.

ఇది ఉత్తుత్తి మీటింగ్..

సమావేశంలో టీడీపీ శింగనమల మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశాన్ని ఊరికే నిర్వహిస్తున్నామని, కమిటీలన్నీ ఎమ్మెల్యేనే ఎంపిక చేస్తారని అన్నారు. మండల, గ్రామ కమిటీ సమావేశాలలో కమిటీలు ఏవీ ఏర్పాటు చేయరని కుండ బద్ధలు కొట్టారు. కేవలం మండల స్థాయి సమావేశం జరగాలనే ఉద్దేశంతోనే ఈ సమావేశం నిర్వహిస్తున్నారని అన్నారు. దీంతో సమావేశానికి వచ్చిన నాయకులు, కార్యకర్తలు అవాక్కయ్యారు. పోటీదారుల్లో తన పేరు ప్రకటించపోవడాన్ని ఎస్సీ సెల్ నాయకుడు దాల్ వీరనారాయణ తప్పుబట్టారు. మరో పుస్తకంలో పేరు ఉందని ఎన్నికల పరిశీలకుడు చదివి వినిపించడంతో వివాదం సద్దుమణిగింది.

రెండువర్గాల ఘర్షణ

మండల కన్వీనర్ పదవికి మట్లగొంది అనిల్ వైపు అధినాయకత్వం మొగ్గు చూపుతోందని పార్టీలోని జూనియర్ నాయకులు, కార్యకర్తలు ఈలలు, కేకలు వేశారు. అంతటితో ఆగకుండా అనిల్‌ను భుజాలపైకి ఎత్తుకున్నారు. దీంతో అక్కడే ఉన్న పార్టీ సీనియర్ నాయకుడు మారుతీనాయుడు వర్గీయులు అనిల్ వర్గంతో వాదనకు దిగారు. మాటా మాటా పెరిగి ఒకరిపై మరొకరు పిడిగుద్దులు గుద్దుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అక్కడే ఉన్న కొందరు సీనియర్ నాయకులు రెండు వర్గాలవారికి సర్దిచెప్పారు. సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్ రెండు వర్గాలవారిని బయటకు పంపారు.

సార్.. భయపెట్టకండి: మారుతీనాయుడు

'సార్..! పార్టీలో జూనియర్ నాయకులు మమ్మల్ని అవమానించే విధంగా కేకలు, ఈలలు వేస్తూ రెచ్చగొట్టారు. అందుకే మావారు వాదనకు దిగారు. కానీ మీరు మా అనుచరులను మాత్రమే భయపెడుతున్నారు. ఇది సరైన పద్ధతి కాదు' అని సీఐ కౌలుట్లయ్యపై టీడీపీ సీనియర్ నాయకుడు మారుతీనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనతో వాదనకు దిగారు. 'మీరు మా మీద కేసులు పెట్టండి. కాని జూనియర్ నాయకులను ఏమీ అనకుండా మా అనుచరులపై పడటం సరికాదు' అని అన్నారు. తాను ఎమ్మెల్యే, పార్టీ అధినాయకత్వం మాటలను శిరసావహిస్తానని అన్నారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు దేగల కృష్ణమూర్తి, మారుతీనాయుడు, ఈశ్వర్ రెడ్డి, ఎం.ఆదినారాయణ, చితంబరిదొర, అబ్దుల్ జీలాని, చిదానందనాయుడు, మాసూల చంద్ర, కుళ్లాయప్ప, పత్తి అనిల్, విశ్వనాథ్ రెడ్డి, రాఘవ రెడ్డి, బండి పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్‌తో కోట్లు దోపిడీ

- వైసీపీపై ధ్వజమెత్తిన ఎమ్మెల్యే అమిలినేని



టీడీపీ పాలన సూపర్ అంటూ ఎమ్మెల్యేతో ఆనందాన్ని పంచుకుంటున్న వృద్ధురాలు

కళ్యాణదుర్గం, జూలై 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో లిక్కర్‌తో కోట్లు దోచుకున్నారని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు విమర్శించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో తలారి రంగయ్య ప్రజా సమస్యలు పట్టించుకోకుండా నిద్రపోయాడన్నారు. టికెట్ కోసం పార్టీ మారిన వ్యక్తి మాటలు విని విమర్శలు చేయడం రంగయ్యకు మంచిది కాదని హితవు పలికారు. మండలంలోని కొత్తూరు, బోయలపల్లి, నారాయణపురం, యర్రంపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన గురించి, తన కంపెనీ గురించి వ్యక్తిగతంగా మాట్లాడితే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. బోయలపల్లిలో వైసీపీ మద్దతు సర్పంచు భర్త హనుమంతరాయుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించా రు. రూ.20 వేలు ఆర్థికసాయాన్ని అందచేసి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరుగుదొడ్డి మాదే..!

- సామాజిక మరుగుదొడ్డి కబ్జా
- పక్కూరి సర్వే నంబరుతో అక్రమ రిజిస్ట్రేషన్
- వైసీపీ నాయకుడి బరితెగింపు



కబ్జా అయిన సామాజిక మరుగుదొడ్డి

యాడికి, జూలై11(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో భూఆక్రమణలకు అడ్డుఅదుపు లేకుండా పోయిందన్నది బహిరంగ రహస్యమే. ఆ పార్టీ నాయకులు ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను సైతం అక్రమ మార్గాల్లో కబ్జా చేసేశారు. ఆఖరుకు మరుగుదొడ్డిని కూడా వదల్లేదు. మండలంలోని చందన గ్రామంలో సామాజిక మరుగుదొడ్డి స్థలాన్ని వైసీపీ నాయకుడు కబ్జా చేశాడు. అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. చందన గ్రామంలో రోడ్డుపక్కనే సర్వే నంబరు 521లో 8 సెంట్ల స్థలంలో సామాజిక మరుగుదొడ్డి ఉంది. వైసీపీ హయాంలో దీనిపై ఓ కబ్జాదారు కన్నేశాడు. అక్రమ మార్గం వెతికాడు. ఏకంగా పక్క గ్రామం లక్షుంపల్లి పరిధిలోని ఓ సర్వే నంబరుతో స్థలాన్ని అక్రమంగా తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. చందన గ్రామంలో మరుగుదొడ్డి ఉంటే.. పక్కూరి సర్వే నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవడం గమనార్హం. విషయం ఇటీవల బయటపడడంతో చందన గ్రామస్థులు దీనిపై యాడికిలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీ ఇచ్చారు. అధికారులు తగు చర్యలు చేపట్టి, స్థలాన్ని గ్రామ పంచాయతీకి అప్పగించాలని కోరుతున్నారు.

కుటుంబాన్ని దత్తత తీసుకోవాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

అనంతపురం కలెక్టరేట్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా అధికారులందరూ ఒక్కో కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జీరో పావర్టీ పీ4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్‌నర్‌షిప్)కార్యక్రమంపై సీపీఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... జీరో పావర్టీ పీ4 కార్యక్రమం కింద



జిల్లావ్యాప్తంగా 68,316 మంది బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. వారి భవితకు భరోసా కల్పించేందుకు దాతలను (మార్గదర్శకులను) గుర్తించాలన్నారు. ఇప్పటివరకు 20మంది మార్గదర్శకులు లాగిన్ అయి రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. వారు 813 మం దిని దత్తత తీసుకున్నారన్నారు. ఆగస్టు 15వ తేదీ నాటికి అర్హత కలిగిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులను గుర్తించాలన్నారు. ఆ దిశగా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఆగస్టు 15 నాటికి లక్ష్యం అధిగమించాలన్నారు.వీసీలో సీపీఓ అశోక్‌కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ జడ్‌ఎం శ్రీనివాస్‌యాదవ్, డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్రశిక్ష ఏపీసీ శైలజ, డీపీఓ నాగరాజునాయుడు, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, డీటీసీ వీర్రాజు పాల్గొన్నారు.

గల్లీ క్రికెట్.. సిల్లీ మ్యాటర్..!

అంపైర్ నిర్ణయం నచ్చక పోలీస్ స్టేషన్‌కు..!



అనంతపురం క్రైం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రికెట్ పోటీలలో ఫీల్డ్ అంపైర్లకు సందేహం వస్తే థర్డ్ అంపైర్‌ను సంప్రదిస్తారు. ఫీల్డ్ అంపైర్ల నిర్ణయం సరికాదని అనిపిస్తే.. ఆటగాళ్లు కూడా థర్డ్ అంపైర్‌ను ఆశ్రయిస్తారు. కానీ మునుముందు గల్లీ క్రికెట్‌కు కూడా థర్డ్ అంపైర్ అవసరం పడేలా ఉంది. అనంతపురం రూరల్ మండలం తాటిచెర్లలో ఇటీవల జరిగిన గల్లీ క్రికెట్ పోటీల్లో అంపైర్ నిర్ణయం నచ్చక ఓ జట్టు క్రీడాకారులు ఏకంగా పోలీసులను ఆశ్రయించారు. అదీ.. వివాదం తలెత్తిన పది రోజుల తరువాత.. రాత్రి 9.30 గంటల సమయంలో..! అంతమంది యువకులు రాత్రి సమయంలో స్టేషన్‌కు రావడంతో ఏదో పెద్ద సమస్యే అని పోలీసులు అనుకున్నారు. విషయం తెలుసుకుని.. అవాక్కయ్యారు. కుర్రాళ్లు కదా.. అని నాలుగు మంచిమాటలు చెప్పి పంపించారు.

ఏం జరిగిందంటే..

తాటిచెర్లలో ఇటీవల క్రికెట్ టోర్నీ జరిగింది. కొన్ని మ్యాచ్‌లు సజావుగానే సాగాయి. సుమారు రెండు రోజుల క్రితం ఫైనల్ మ్యాచ్ ప్రారంభమైంది. మొదటి ఓవర్ నాలుగో బాల్ విషయంలో అంపైర్ తీసుకున్న నిర్ణయం బుక్కరాయసముద్రం జట్టుకు నచ్చలేదు. ఇరుజట్ల మధ్య వివాదం తలెత్తింది. అంపైర్ నిర్ణయం మారకపోవడంతో బుక్కరాయసముద్రం జట్టు ఆ మ్యాచ్‌ను బహిష్కరించింది. ఫైనల్ మ్యాచ్ ఆడలేకపోయామన్న అసంతృప్తి వారిలో పెరిగిపోయింది. సమస్య పరిష్కారం కోసం వారం క్రితం.. అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. 'సార్.. అంపైర్ ఇలా చేశారు. మీరే న్యాయం చేయాలి..' అని జరిగిన విషయం చెప్పారు. కుర్రాళ్లు థర్డ్ అంపైర్ బాధ్యత తమకు అప్పగించడంతో పోలీసులకు నవ్వాలో.. కోప్పడాలో అర్థం కాలేదు. అయినా సరే.. వివాదాన్ని పరిష్కరించారు. 'మ్యాచ్‌ను అలా మధ్యలో వదిలేసి రాకూడదు. టోర్నీ నిబంధనలు పాటించాలి. క్రీడల్లో వివాదాలు మామూలే. కానీ గొడవపడకూడదు..' అని హితవు పలికారు. ఆ జట్టును కూడా పిలిపించి మాట్లాడుతామని, ఎవరు గెలిచినా.. ప్రైజ్ మనీని సామాజిక సేవకు ఉపయోగించాలని సూచించి పంపించారు. ఇలా.. థర్డ్ అంపైర్ పాత్రను పోలీసులు శాంతియుతంగా నిర్వర్తించారు.

దెబ్బతిన్న బండ పరుపు





చాగల్లు ప్రాజెక్ట్ కార్యాలయం

ఎంత సొమ్ము వృథానో..!

● నిరుపయోగంగా చాగల్లు ప్రాజెక్ట్ కార్యాలయాలు ● శిథిలావస్థలో హెచ్చెల్సీ క్వార్టర్లు ● పట్టించుకోని అధికారులు

తలుపులు మాయం..





ఏపుగా పెరిగిన ముళ్లపొదలు

తాడిపత్రి, జూలై 11(ఆంధ్రజ్యోతి): లక్షలు వెచ్చించి నిర్మించిన చాగల్లు ప్రాజెక్ట్ కార్యాలయాలు నిరుపయోగంగా మారాయి. అలనా పాలన లేకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. చాగల్లు ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయిన తర్వాత అప్పటి ప్రభుత్వం తాడిపత్రి రైల్వేస్టేషన్ పక్కనే సమీపంలో చాగల్లు ప్రాజెక్ట్ కార్యాలయాన్ని దాదాపు రూ.50 లక్షలతో నిర్మించింది. హెచ్చెల్సీ ఆఫీసులకు సంబంధించి ఎన్నోఏళ్ల నుంచి ఉన్న భవనాలు దెబ్బతినడంతో వాటిస్థానంలో ప్రాజెక్ట్ కార్యాలయాల పక్కనే దాదాపు రూ.2కోట్లు వరకు వెచ్చించి కార్యాలయాలతోపాటు క్వార్టర్స్‌ను కూడా ఏర్పాటుచేశారు. కొత్తగా నిర్మించిన సమయంలో కొద్ది రోజులు కార్యాలయంలో కార్యకలాపాలు జరిపారు. రాత్రిపూట ఇబ్బందిగా ఉందంటూ తర్వాత వాటిని మూసివేసి పాత కార్యాలయాల్లోకే మకాం మార్చారు. ఇది జరిగి దాదాపు 15 ఏళ్ల గడిచాయి. అప్పటి నుంచి వాటిని పట్టించుకోలేదు. దీంతో కొందరు దుండగులు భవనాలకు ఉండే సామగ్రిని ధ్వంసం చేయడంతోపాటు తలుపులు, కిటికీలు ఎత్తుకొని వెళ్లారు. అక్కడ అసాంఘిక కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయన్న ఆరోపణలు



ధ్వంసమైన కిటికీలు

వినిపిస్తున్నాయి. కొంతమంది గొర్రెలను వాటిలో తోలుకుంటున్నారు. వీటనన్నింటిని చూసినా అధికారులు మాత్రం ఏమి తెలియనట్లు ప్రవర్తిస్తున్నారు. భవనాలు శిథిలావస్థకు చేరడంతో చుట్టూ ముళ్లపొదలు పెరిగి, చిట్టడవిని తలపిస్తోంది. చాగల్లు ప్రాజెక్ట్ అధికారులు ఇక్కడ లేకుండా జిల్లాకేంద్రానికి మకాం మార్చారు. అక్కడి నుంచి కార్యకలాపాలు జరుపుతున్నారు. దీంతో కార్యాలయాన్ని, క్వార్టర్స్‌ను పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు.

● అధికారులను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా అక్కడ అప్పట్లో కార్యాలయాలు క్వార్టర్లు నిర్మించారు. అందులో సిబ్బంది ఉంటుండగానే దొంగతనాలు జరిగాయి. దీంతో బెదిరి పాత భవనమే బాగుంటుందన్న ఆలోచనతో అప్పట్లో ఇక్కడ చేరినట్లు తెలిపారు. తర్వాత ప్రభుత్వాలు మారినా ప్రాజెక్ట్ కార్యాలయం, క్వార్టర్ల గురించి పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ఈ కూటమి ప్రభుత్వమైనా వీటిని పట్టించుకుని భవనాలను వినియోగంలోకి తెస్తుందేమోనని ఆశిస్తున్నట్లు తెలిపారు.

పంటల బీమా.. రైతన్నకు ధీమా

● క్రాప్ ఇన్సూరెన్స్‌తో అన్నదాతలకు లాభం ● పంట నష్టం వాటిల్లితే బీమా వర్తింపు ● ప్రీమియం అధికంగా ఉండటంతో కొందరు దూరం



దానిమ్మ తోటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్(ఫైల్)

కొత్తచెరువు, జూలై 11(ఆంధ్రజ్యోతి): అతివృష్టి, అనావృష్టితో నష్టపోతున్న అన్నదాతలను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాల అమలుకు శ్రీకారం చుట్టాయి. ఫసల్‌బీమాకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 15 వరకు, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకానికి ఈ నెలాఖరు వరకు గడువు ఉన్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. సొంతభూమి ఉన్న వారు, కౌలుదారులు బీమా పథకాలకు అర్హులని జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు.

ఫసల్ బీమా వర్తించే పంటలు..

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) ఈ ఏడాది ఖరీఫ్‌లో పశ్చిమగోదావరి, శ్రీసత్యసాయి, విజయనగరం జిల్లాల్లో మాత్ర మే అమలౌతోంది. వరి, మొక్కజొన్న, కందులు, రాగులు, ఆముదం, నువ్వుల పంటలకు ఈ బీమా వర్తిస్తుంది. పంటకోత ప్రయోగాల (సీసీఈ) నివేదిక ప్రకారం సగటు దిగుబడికంటే ఆ సంవత్సర దిగుబడి తక్కువ ఉన్నట్లయితే పంట నష్టపరిహారం వస్తుంది. ఈ పరిహారాన్ని అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎఐసీ)ద్వారా రైతులకు ప్రభుత్వం అందజేస్తుంది.



హిందూపురం వద్ద సాగుచేసిన టమోటా పంట

దరఖాస్తు ఇలా...

సొంత భూమి కల్గిన రైతులు, కౌలుదారులు ఫసల్ బీమా యోజనకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. బ్యాంకుల్లో కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా, పంట రుణం పొందిన వారు బీమాను పొందవచ్చు. బ్యాంకుల్లో రుణం పొందనివారు, బీమాకు కొత్తగా దరఖాస్తు చేసుకొనే వారు సీఎస్‌సీ(కామన్ సర్వీస్ సెంటర్), మీసేవా, బీమా కంపెనీ ఏజెంట్ల వద్దగాని, పీఎంఎఫ్‌బీవై పోర్టల్(డబ్లుడబ్లుడబ్లు.పీఎంఎఫ్‌బీవై.జీఓవీ.ఇన్) ద్వారా గాని, పీఎంఎఫ్‌బీవై మొబైల్ అప్లికేషన్ ద్వారా ప్రక్రియను పూర్తి చేయవచ్చు. దరఖాస్తుకు బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్ కార్డు, భూమి పాస్ బుక్ జిరాక్సులతో పాటు రైతుసేవా కేంద్రాల్లో పనిచేసే వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలు పంట వేసినట్టు ఇచ్చే ధ్రువపత్రాన్ని జతపరచాలని వ్యవసాధికారులు చెబుతున్నారు.

వాతావరణ బీమా.. వీటికే..

వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం పంట సాగుచేసిన ప్రతి రైతుకు అందిస్తోంది. వాతావరణ బీమాకు కూడా ఫసల్ బీమా మాదిరిగానే సచివాలయం, సీఎస్‌సీ సెంటర్లలోను, పీఏసీఎస్, పోస్టాఫీసు ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్(ఎన్సీఐపీ)వెబ్‌సైటట లేదా మొబైల్ యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. ఈ బీమా పథకం కిందకు పత్తి, వేరుశనగ, టమోటాతో పాటు ఉద్యాన పంటలు వస్తాయయని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రీమియం వివరాలు ఇలా..

పంట	ఎకరాకు చెల్లించాల్సిన ప్రీమియం	ప్రభుత్వం ఎకరాకు ఇచ్చే బీమా
వరి	రూ.200	రూ.40 వేలు
మొక్కజొన్న	రూ.165	రూ.33 వేలు
కందులు	రూ.102	రూ.20 వేలు
రాగులు	రూ.100	రూ.20 వేలు
అముదం	రూ.100	రూ.20 వేలు

ప్రీమియం వివరాలు ఇలా..

పంట	రైతు హెక్టారుకు చెల్లించవలసిన ప్రీమియం	ప్రభుత్వం హెక్టారుకు చెల్లించే పరిహారం
బత్తాయి	రూ.6875	రూ.1,37,500
వేరుశనగ	రూ.1600	రూ.80 వేలు
దానిమ్మ	రూ.9375	రూ.1,87,500
పత్తి	రూ.4750	రూ.95 వేలు
టమోట	రూ.4000	రూ.80 వేలు

వాతావరణ బీమా ఇలా..

ప్రభుత్వం వాతావరణ ఆధారిత పంటల బీమా విషయంలో వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలి,వాన బీభత్సం, పాక్షిక ఆర్ద్రత ఆధారంగా పంట నష్టాన్ని లెక్కిస్తుంది. వాతావరణ అంశాల ఆధారంగా పంట నష్టాన్ని అంచనా వేసి ఆయా మండలాల పరిధిలో బీమా పరిహారం లెక్కిస్తారని అధికారులు చెబుతున్నారు. పంట నష్టాన్ని బీమా కంపెనీలు వాతావరణం, దిగుబడి ఆధారంగా అందిస్తాయి. వేరుశనగ, పత్తి, టమోట పంటలు సాగుచేసిన రైతులు క్రాప్ బుకింగ్ చేయించుకున్న వారికి మాత్రమే పంటనష్టం వర్తిస్తుందని బీమా కంపెనీ ప్రతినిధులు తెలియజేస్తున్నారు.

బీమా కోసం మామిడి రైతుల ఎదురుచూపు

జిల్లాలో మామిడి సాగు చేసి వర్షాలు, గాలులకు నష్టపోయిన రైతులు బీమా కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2300 మంది రైతులకు సంబంధించి దాదాపు 4 వేల ఎకరాల్లో మామిడి పంట నష్టం జరిగినట్లు బీమా కంపెనీలు ప్రకటించాయి. అయితే ఇప్పటి వరకూ బీమా అందలేదని, కనీసం ఎప్పుడిస్తారన్న సమాచారం కూడా లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా బీమా ప్రీమియం అధికంగా ఉండటంతో చాలామంది రైతులు క్రాప్ ఇన్సూరెన్స్ చేసుకోలేదు. దీంతో వారంతా పంటల బీమాకు దూరమవుతున్నారు.

సొసైటీలకు జవసత్వాలు

● ఏడీసీసీబీ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జీతాలు కూడా చెల్లించలేని దయనీయ స్థితిలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (సొసైటీ)లకు జవసత్వాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఏడీసీసీబీ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి తెలిపారు. సొసైటీల అభివృద్ధి గురించి 'ఆంధ్రజ్యోతి'తో ఆయన పలు విషయాలు ముచ్చటించారు.

ప్ర: ఉమ్మడి జిల్లాలో ఎన్ని బ్రాంచ్‌లు, ఎన్ని సొసైటీలు ఉన్నాయి?

జ: ఉమ్మడి జిల్లాలో 28బ్రాంచ్‌లు, 108 సొసైటీలు ఉన్నాయి.

ప్ర: బ్యాంకు అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేశారు?

జ: బ్యాంకులో పరిస్థితులపై పరిశీలిస్తున్నా. ప్రధాన కార్యాలయంతో పాటు బ్రాంచ్‌ల్లో ఉన్న ఉద్యోగుల మధ్య మొదట సమన్వయం పెంచాల్సిన అవసరం ఉంది. అధికారుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి సత్ఫలితాల కోసం కృషి చేస్తా.

ప్ర: బ్యాంకులో ప్రస్తుత పరిస్థితి ఎలా ఉంది?

జ: బ్యాంకులో ప్రస్తుతం అధికారుల మధ్య సమన్వయలోపం స్పష్టంగా కనిపిస్తోంది. బ్యాంకులో సీఈఓలుగా పనిచేసిన సీనియర్ అధికారులు ఉండటం, వారి మధ్య సఖ్యత లేకపోవడం బ్యాంకు తిరోగమనానికి ప్రధాన కారణంగా గుర్తించా. మా బ్యాంకు కుటుంబంలోని అందరినీ ఏకతాటిపైకి తీసువచ్చి సమష్టి కృషి చేయడానికి చర్యలు తీసుకుంటా.

ప్ర: వైసీపీ ప్రభుత్వంలో బ్యాంకులు, సొసైటీల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకుంటారా?

జ: గతంలో బ్యాంకు, సొసైటీలలో అవినీతి, అక్రమాల ఆరోపణలు ఉన్న మాట వాస్తవమే. వాటన్నింటిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి, తగిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోం. ముఖ్యంగా ఆత్మకూరు నకిలీ పట్టాల రుణాలు, ఉద్యోగి శ్రీధర్ వీఆర్ఎస్‌పై విచారణ చేపడుతాం. అవకతవకలకు పాల్పడినట్లు తేలితే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

ప్ర: మండలానికి ఒక బ్రాంచ్ పెట్టాలనే ప్రతిపాదన పరిస్థితి ఏమిటి?

జ: మండలానికి ఒక బ్రాంచ్ పెట్టాలనేది మంచి ఆలోచన. ప్రభుత్వం, ఆప్కాబ్, నాబార్డు, ఆర్‌బీఐ ఉన్నతాధికారులతో చర్చించి ఈ అంశం అమలు సాధ్యాసాధ్యాలపై సరైన నిర్ణయం తీసుకుంటాం.

ప్ర: బ్యాంకును నష్టాల నుంచి గట్టెక్కించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: ఏడీసీసీ బ్యాంకును పురోగతిలో మొదటి స్థానంలో నిలిపేందుకు మొదట ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం, కమర్షియల్ బ్యాంకులకు దీటుగా ఆధునీకరించడం, డిపాజిట్ల సేకరణ, రైతులకు సేవలను మరింత చేరువ చేయడంపై దృష్టి సారిస్తున్నాం.

తలుపులు తీయరా స్వామీ..!



మధ్యాహ్నమైనా తెరుచుకోని ఈఓ కార్యాలయం

ఉరవకొండ, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి. నిత్యం జిల్లా నుంచే కాకుండా కర్ణాటక భక్తులు వందల సంఖ్యలో వస్తుంటారు. అలాంటి ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) కార్యాలయం శుక్రవారం మధ్యాహ్నమైనా తెరుచుకోలేదు. అధికారులు, సిబ్బంది ఎవరూలేరు. ఇక్కడ పనిచేస్తున్న పలువురు సిబ్బందిని డెప్యుటేషన్‌పై పంపగా.. ఈఓ, అటెండర్ మాత్రమే మిగిలారు. వారు కూడా సక్రమంగా విధులకు హాజరు కావట్లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఆలయంలో ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు అటెండర్లు ఉండేవారు. వారిలో ఒక జూనియర్ అసిస్టెంట్, అటెండర్‌ను పెద్ద పప్పూరు అశ్వత్థం ఆలయానికి డెప్యుటేషన్‌పై వేశారు. మరో జూనియర్ అసిస్టెంట్‌ను గూగూడుకు, ఇంకొకరిని పంపనూరుకు డెప్యుటేషన్‌పై వెళ్లారు. దీంతో ఉన్న కాంట్రాక్టు సిబ్బంది కూడా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. దీంతో కార్యాలయాన్ని తెరిచేవారు కరువయ్యారు. ఆలయ ఈఓ రమేష్, జూనియర్ అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. వారు కూడా విధులకు హాజరు కాలేదు. ఈనెల 10వ తేదీన దేవదాయ శాఖ ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్.. ఆలయాన్ని తనిఖీ చేశారు. ఆయన పర్యటనను గోప్యంగా ఉంచారు. దీనిపై సర్వత్రా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. డెప్యుటేషన్ల వ్యవహారం బయటపడకూడదనే పర్యటనపై గోప్యం వహించారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు చొరవచూపి డెప్యుటేషన్‌పై వెళ్లిన సిబ్బందిని రప్పించాలని భక్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఈఓ రమేష్‌ను అడగ్గా.. పరిపాలన సౌలభ్యం దృష్టా బదిలీ చేశారన్నారు. సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం ఉండడంతో తాను వెళ్లాననీ, ఆలయానికి రాలేకపోయానన్నారు.

నాటుసారా రహిత జిల్లాగా మార్చాలి

పుట్టపర్తి రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లాను సారా రహితంగా తీర్చిదిద్దాలని ఎక్సైజ్ శాఖ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య.. ఆ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో శుక్రవారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా వారు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహులుతో కలిసి ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఎక్సైజ్ సీఐలతో సమీక్ష నిర్వహించారు. పలు సూచనలు చేశారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ చంద్ర శేఖర్‌రెడ్డి, జిల్లా ఎక్సైజ్ అధికారి గోవిందనాయక్ పాల్గొన్నారు.

ఆరోగ్యవంత జనాభా.. దేశానికి ఆస్తి

● జిల్లా వైద్యాధికారి ఈబీ దేవి



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి

అనంతపురం వైద్యం, జూలై 11(ఆంధ్రజ్యోతి): భూములు, డబ్బు కంటే ఆరోగ్యవంతమైన జనాభా దేశానికి ఆస్తి అని జిల్లా వైద్యాధికారి ఈబీ దేవి పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినం పురస్కరించుకుని నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని జిల్లా వైద్యాధికారి జెండా ఊపి, ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల్లో జనాభా తగ్గుదల మొదలైందన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం జనాభా నిర్వహణకు పెద్దపీట వేస్తోందన్నారు. దంపతులు తప్పనిసరిగా సంతానం పొందాలన్నారు. తద్వారా భవిష్యత్తులో ఆరోగ్యవంతమైన యువ జనాభా పెరిగి, దేశాభివృద్ధికి తోడ్పడతారన్నారు.

రికార్డు సృష్టించారు

లక్ష్యానికి మించి హంద్రీనీవా లైనింగ్ పనులు

24 గంటల్లో 79వేల చదరపు మీటర్ల పనులు పూర్తి



కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు, కార్మికులను అభినందిస్తున్న హంద్రీనీవా ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్ పనుల్లో రికార్డు సృష్టించారు. అనుకున్న సమయం కంటే ముందుగానే లక్ష్యాన్ని సాధించి ఔరా అనిపించారు. శ్రీశైలం డ్యాం నుంచి మల్యాల వద్ద కృష్ణా జలాలను హంద్రీనీవాకు వదిలేలోపు కనీసం లైనింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులు భావించారు. ఈక్రమంలోనే 24గంటల సమయంలో పూర్తి చేయాలని టార్గెట్ విధించుకున్నారు. రాత్రింబవళ్లు పని చేసిశారు. 7వేల క్యూబిక్ మీటర్ల స్టీల్ ఫైబర్ రెయిన్ హార్స్‌మెంట్ కాంక్రీట్‌తో 70వేల చదరపు మీటర్లు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు ఎస్ఈ రాజా స్వరూప్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఉదయం 6గంటల నుంచి శుక్రవారం ఉదయం 6గంటలలోపు పూర్తి చేయాలని నిర్దేశించినప్పటికీ శుక్రవారం ఉదయం 4గంటలకే 8వేల క్యూబిక్ మీటర్ల స్టీల్ ఫైబర్ రెయిన్‌హార్స్‌మెంట్ కాంక్రీట్‌తో 79వేల చదరపు మీటర్ల లైనింగ్ పూర్తి చేసినట్లు తెలిపారు. ఆర్‌వీఆర్-ఎల్‌సీసీ సంస్థ, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్, ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థల కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు, కార్మికులను జిల్లా జలవనరుల శాఖ ప్రాజెక్ట్‌ల సీఈ నాగరాజ, హంద్రీనీవా ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్‌లు అభినందించారు. అత్యాధునిక సాంకేతిక సహాయంతో 1385భారీ యంత్రాలను, 2945మంది కార్మికులు, ఇంజనీర్లను భాగస్వాములు చేసి ఈ రికార్డు సాధించినట్లు అధికారులు తెలిపారు.

నిద్రలో నిఘా..!

(5వ పేజీ తరువాయి)

పాల్పడుతున్నట్లు స్పష్టం అవుతోంది. సీసీ కెమెరాల్లో రికార్డు అయిన చోరీ దృశ్యాలను పరిశీలించిన పోలీసు అధికారులు ఇవి బయటిదొంగల పనిగా నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. నియోజవర్గంలోని పలు మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలు లెక్కలేనన్ని జరిగాయి. దొంగతనాలు వరుసగా జరుగుతున్నా పట్టించుకునే వారే లేరని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గత నెలలో వైశ్యాబ్యాంక్ కాలనీలో కోసిన కిటికీ ఊచలు

నిఘా ఏదీ..?

పట్టణంలో శాంతి, భద్రతలకు భంగం కలుగకుండా పోలీసులు రక్షణగా ఉంటారు. ప్రమాదాలు, దొంగతనాలు, గొడవలు వంటి వాటిని ముందే అంచనా వేయడానికి పోలీసు శాఖ నిఘా విభాగాన్ని ఏర్పాటు చేసింది. అయితే ఆ నిఘా విభాగం కదిరిలో నిద్రపోతున్నట్లు ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఐడి పార్టీ, స్పెషల్ బ్రాంచ్‌తోపాటు ఇంటెలిజెన్స్ విభాగాలు ఉన్నా వరుసగా దొంగతనాలు జరుగుతుండటం ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. పట్టణంలో వరుస దొంగతనాలు, బస్టాండులో జేబు దొంగలు, గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు, హుండీ దొంగత నాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. శివారు ప్రాంతాల్లో విశాలంగా ఉంటుందని ఇళ్ల కట్టుకుంటే దొంగల భయంతో కంటిమీద కునుకు లేకుండా ఉందని పేరు చెప్పడానికి భయపడిన ఓ ఉద్యోగి చెప్పారు. పోలీసులు నిఘా పెంచి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరతున్నారు.

దొంగల ఆచూకీ తెలిసింది..



కదిరిలో ఇటీవల జరిగిన దొంగతనాల్లో దొంగల అచూకీ తెలిసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన వారిగా గుర్తించాం. వారిని పట్టుకునే ప్రయత్నంలో ఉన్నాం. ప్రజలు భయపడాల్సిన పనిలేదు. పోలీసులు రక్షణగా ఉన్నారు. దొంగతనాలు జరగకుండా నిఘా పెంచుతాము. - శివనారాయణ స్వామి, డీఎస్పీ

ఒకే రాత్రి మూడు చోరీలు

గాండ్లపెంట, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గురువారం రాత్రి మూడు చోరీలు జరగడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కదిరి, రాయచోటి ప్రధాన రహదారిలో ఉన్న నాగకుమారి టిఫిన్ సెంటర్ తాళాలు పగలకొట్టి గ్యాస్ సిలిండర్, మిక్సీ, రెండు బియ్యం బస్తాలు, కూల్‌డ్రింక్‌లు చోరీ చేశారు. ఇదే దుకాణంలో ఇప్పటికి మూడుమార్లు చోరీలు జరిగాయి. ఎస్సీ కాలనీలో హుస్సేన్‌బీ ఇంటి తాళాలు పగలకొట్టి బీరువాలోని ఐదుతులాల బంగారం, వెండి నగలు చోరీ చేశారు. తూపల్లి రహదారిలోని సుబహాన్ టైలర్ దుకాణం తాళాలు పగలకొట్టి దుస్తులు చోరీ చేశారు. మరి కొన్ని ఇళ్లలో బయట ఉన్న వస్తువులు చోరీ చేసినట్లు చెప్పారు. ఎస్ఐలు వలీబాషా, మగ్బుల్ బాషా, సీఐ నాగేంద్ర చోరీ ప్రాంతాలను పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీమ్‌తో ఆధారాలు సేకరించారు.



గాండ్లపెంటలో బీరువా పగులకొట్టిన దొంగలు

అదుపు తప్పిన ప్రైవేటు స్కూల్ బస్సు

● విద్యార్థులంతా క్షేమం


ప్రమాదానికి గురైన బస్సు

కూడేరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పేరు గ్రామ సమీపంలో శ్రీ సంగమేశ్వర ప్రైవేటు స్కూల్‌కు చెందిన బస్సు శుక్రవారం అదుపు తప్పి రోడ్డు పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లింది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థులు భయంతో వణికిపోయారు. మండల కేంద్రంలోని పాఠశాలకు పి.నాగిరెడ్డిపల్లి, ఇప్పేరు గ్రామాల నుంచి దాదాపు 50 మంది విద్యార్థులను బస్సులో ఎక్కించుకున్నారు. ఇప్పేరు దాటిన తర్వాత మలుపు వద్దకు రాగానే స్టీరింగ్ రాడ్ కట్ కావడంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. అయితే బస్సులో ఉన్న విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో విద్యుత్ లైన్లు ఉన్నాయని, జరగరానిది జరిగి ఉంటే ఎవరిది బాధ్యత అని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటన స్థలాన్ని సీఐ రాజు పరిశీలించారు. కండిషన్ లేని బస్సులో విద్యార్థుల ను ఎలా తరలిస్తారని పాఠశాల యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ప్రమాదానికి గురైన బస్సును స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం విద్యార్థులను మరో బస్సులో తరలించారు.

జాతీయ స్థాయిలో సర్పంచు సత్తా


హనుమంతరెడ్డి

కూడేరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి. నారాయణపురం సర్పంచు హనుమంతరెడ్డి జాతీయ స్థాయిలో ఘనత సాధించారు. సర్పంచ్ సంవాద్ పోటీల్లో రెండో స్థానం సాధించారు. భారత నాణ్యతా మండలి దేశంలోని సర్పంచులను ఒకే వేదికపైకి తెచ్చేందుకు సర్పంచ్ సంవాద్ పేరిట మొబైల్ అప్లికేషన్ ప్రవేశపెట్టింది. మెరుగైన పాలన, గ్రామాభివృద్ధి, సమన్వయం, సాంకేతికత, సమాచారం మార్పిడి దీని ముఖ్య ఉద్దేశ్యం. ఈక్రమంలోనే ప్రతి నెలా సర్పంచులకు పోటీలు నిర్వహిస్తూ, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తోంది. జూన్ నెలకు సంబంధించి గ్రామాభివృద్ధి భవిష్యత్తు ఆలోచనలపై నిర్వహించిన పోటీలకు తాను పంపిన వీడియోకు జాతీయ స్థాయిలో తనకు రెండో స్థానం దక్కినట్లు సర్పంచు హనుమంతరెడ్డి తెలిపారు. నగదు ప్రోత్సాహం కింద రూ. 25 వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

వర్సిటీలో ఉద్యోగుల గొడవ..!

అనంతపురం రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో ఇద్దరు ఉద్యోగులు వ్యక్తిగత కారణాలతో గొడవ పడ్డారు. వర్సిటీలోని ఓ విభాగం వద్ద రెండురోజుల కిందట టైం స్కేల్ ఉద్యోగి నాగలింగం, డైలీ వేజ్ ఉద్యోగి పూల సాయికుమార్ మధ్య మాటామాటా పెరిగి, దాడి చేసుకున్నారు. దీనిపై నాగలింగం.. ఇటుకలపల్లి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్కేయూ వీసీ, రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశాడు. తాను పనిమీద ఫిజిక్స్ డిపార్ట్మెంట్‌కు వెళ్లగా అక్కడే అటెండర్‌గా పనిచేస్తున్న సాయికుమార్ అసభ్య పదజాలంతో దూషిండడంతోపాటు దాడి చేశాడన్నారు. తోటి ఉద్యోగులు విడిపించారన్నాడు. పొలం తగాదాను మనసులో పెట్టుకుని, తనపై దాడి చేసినట్లు తెలిపాడు. తన సోదరి ఇటుకలపల్లికి వెళ్లేందుకు రూడ్ సెట్ వద్ద ఆటో కోసం వేచి చూస్తుండగా సాయికుమార్ బైక్‌తో ఢీకొట్టి వెళ్లిపోయాడని ఆరోపించాడు. ఆమెను ఆస్పత్రిలో చేర్పించి, పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. వర్సిటీలో సదరు ఉద్యోగుల మధ్య గొడవకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.

వడ్డీ వ్యాపారులు వేధిస్తున్నారని..!


వీడియోలో మహబూబ్‌బాషా

అనంతపురం క్రైం, జూలై 11(ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారులు వేధిస్తున్నారని, తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని బుక్కరాయసముద్రానికి చెందిన మహబూబ్ బాషా అనే వ్యక్తి సెల్ఫీ వీడియో పెట్టాడు. అనంతరం విష రసాయనం తాగాడు. కుటుంబ సభ్యులు బాధితుడిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన నగర శివారులోని రాజీవ్ కాలనీలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన మేరకు, మహబూబ్ బాషా కలెక్టరేట్ సమీపంలోని ఓ టీ స్టాల్‌లో పనిచేస్తున్నాడు. రామాంజి అనే వ్యక్తి నుంచి వడ్డీకి అప్పు తీసుకున్నాడు. రాజీవ్ కాలనీలోని తన చెల్లెలి ఇంటికి శుక్రవారం ఉదయం వెళ్లాడు. వడ్డీ డబ్బుల కోసం తనను వేధిస్తున్నారని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నానని విషాన్ని తాగుతూ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. వడ్డీ కట్టలేమని, అసలు కడతామని చెప్పినా రామాంజి భార్య వినలేదని మహబూబ్ బాషా భార్య ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు ఖాళీ చేసి అప్పగించాలని, లేదంటే ఇల్లు అమ్మి డబ్బులు కట్టాలని ఒత్తిడి తెచ్చిందని వాపోయారు. మొదట రూ.10 వడ్డీ అన్నారని, ఆ తర్వాత రూ.5 వడ్డీకి వచ్చారని అన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

పుట్టపర్తిరూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని బీడుపల్లికి చెందిన మహేంద్ర(33) అప్పుల బాధతో శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. మహేంద్ర రజక వృత్తి చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవాడు. వృత్తి పనులు గిట్టుబాటు కాకపోవడంతో కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. వాటిని తీర్చేమార్గంలేక ఇంట్లో ఉరి వేసుకున్నాడు. మహేంద్రకు భార్య నందిని, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. అర్బన్ సీఐ సునీత దర్యాప్తు చేస్తున్నారు.

పందిని ఢీకొన్న ద్విచక్రవాహనం

వృద్ధురాలి మృతి

హిందూపురం, జూలై11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోతుకపల్లి వద్ద పందిని ద్విచక్రవాహనం ఢీకొనడంతో కాంతమ్మ(70) మృతిచెందింది. పరిగి మండలం పెద్దరెడ్డిపల్లికి చెందిన కాంతమ్మ వరుసకు అల్లుడైన ఉమాశంకర్‌తో కలిసి ద్విచక్రవాహనంలో హిందూపురం నుంచి పెద్దరెడ్డిపల్లికి బయల్దేరింది. మోతుకపల్లి వద్దకు రాగానే పంది అడ్డు రావడంతో ద్విచక్రవాహనం ఢీకొని అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో కాంతమ్మ అక్కడికక్కడే మృతిచెందగా.. ఉమాశంకర్‌కు గాయాలయ్యాయి. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

మా పాలనలో రెండింతల అభివృద్ధి

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్, వేదికపై ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తదితరులు

కణేకల్లు, జూలై 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో కుంటుపడిన అభివృద్ధిని రెండింతలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మండలంలోని యర్రగుంట గ్రామంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో తల్లికి వందనం పథకం కింద రూ. 10వేల కోట్లను తల్లుల ఖాతాల్లో జమ చేశామన్నారు. హంద్రీనీవా కాలువ అభివృద్ధికి రూ.3800 కోట్లు కేటాయించి రాయలసీమను సస్యశ్యామలం చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. హెచ్చెల్సీ మరమ్మతులకు రూ.35 కోట్లు కేటాయించి పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. చెత్తపన్ను, ల్యాండ్ టైటిలింగ్‌ను రద్దు చేసి రైతులు, ప్రజలకు పన్నుల నుంచి ఉపశమనం కలిగించామన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి జగన్ లాంటి భూతాన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్టానికి పరిశ్రమలు రాకుండా జగన్ పార్టీ కుట్రపూరిత చర్యలకు పాల్పడుతోందన్నారు. తనకు ఉరవకొండ, రాయదుర్గం ప్రాంతాలు రెండు కళ్లు అన్నారు. రాష్ట్రానికి తాను మంత్రి అయినప్పటికీ జిల్లాకు మాత్రం మొదటి కూలీగా పని చేస్తానన్నారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ తాను రాయదుర్గం నియోజక అభివృద్ధికి నిధులు అడిగిన వెంటనే మంత్రి పయ్యావుల కేశవ్ సానుకూలంగా స్పందించడం హర్షనీయమన్నారు. అనంతరం రూ. 1.70 కోట్లతో నిర్మించిన వీహెచ్‌సీ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. హెచ్చెల్సీ మరమ్మతుల్లో భాగంగా 137 కి.మీ. వద్ద జరుగుతున్న అండర్ టన్నెల్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ హనుమంతరెడ్డి, డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, హెచ్చెల్సీ ఎస్‌ఈ విశ్వనాథ్‌రెడ్డి, టీడీపీ నాయకులు వన్నారెడ్డి, రమేష్‌రెడ్డి, తిప్పారెడ్డి, లాలెప్ప, ఆనంద్‌రాజ్, ఆది, కోళేకుర్తి సుదర్శన్, బసవరాజు, బీటీ రమేష్, షేక్‌ముజ్జు, బాయినేని నవీన్, మారుతి పాల్గొన్నారు.

మామే సూత్రధారి..!

● వివాహేతర సంబంధం, భూమి విషయంలో వివాదం ● రూ.నాలుగు లక్షల సుపారీ
● ముదిగుబ్బ శివారులో హత్య ● ఐదుగురు నిందితుల అరెస్టు


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

ధర్మవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బలో జరిగిన హత్యకు సంబంధించి మృతుడి మామే సూత్రధారి అని పోలీసులు వెల్లడించారు. ఈ హత్య కేసులో నిందితులైన ఐదుగురిని అరెస్టు చేసినట్లు ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఆయన అరెస్టు వివరాలను వెల్లడించారు. ఈనెల మూడో తేదీ ముదిగుబ్బ శివారు చిన్నబుడ్డంగుట్టవద్ద గల పొలంలో ఓ వ్యక్తి మొండెం కనిపించింది. గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ శివరాముడు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడ లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడి వివరాలు సేకరించారు. మృతుడిని తనకల్లు మండలం ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన విశ్వనాథ్‌గా గుర్తించారు. ప్రస్తుతం ఆయన కదిరి శివాలయం వీధిలో కాపురం ఉంటున్నట్లు తెలుసుకున్నారు. మృతుడు విశ్వనాథ్ భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. తర్వాత విశ్వనాథ్ ఫోన్ కాల్ డేటా ఆధారంగా అనుమానితులైన బత్తలపల్లి మండలం గరిశనపల్లికి చెందిన కమతం కాటమయ్య, యర్రాయపల్లికి చెందిన సాకే మధుబాబు, కమతం రామకృష్ణ, ఓడీసీ మండలం గాజుకుంటపల్లికి చెందిన బెట్టకుంట వెంకటరమణప్ప, శెట్టివారిపల్లికి చెందిన మంకముతక శంకరను గురువారం సాయంత్రం ముదిగుబ్బ మండలం రాళ్ల అనంతపురంక్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి మూడు వేటకొడవళ్లు, ఒక ఆటో, మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కోర్టులో హాజరపరిచామన్నారు.

హత్యకు నేపథ్యం ఇదీ..

మృతుడు విశ్వనాథ్‌కు 20 ఏళ్ల కిందట ఓబుళదేవరచెరువు మండలం గాజుకుంటపల్లికి చెందిన బెట్టకుంట వెంకటరమణ పెద్దకుమార్తె శ్యామలతో వివాహం అయింది. అయితే మృతుడు తన మరదలితో వివాహేతర సంబంధం పెట్టుకోవడం, తన అత్త పేరిట ఉన్న విలువైన భూములు అమ్ముకోవడంతో మామ వెంకటరమణతో వివాదం ఏర్పడింది. దీంతో వెంకటరమణ అల్లుడిపై కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో విశ్వనాథ్‌ను హత్య చేయడానికి కమతం కాటమయ్యకు రూ.4లక్షలకు సుపారీ ఇచ్చాడు. మధ్యవర్తిగా మంకముతక శంకర వ్యవహరించాడు. కాటమయ్య కొన్ని నెలల నుంచి విశ్వనాథ్‌తో పరిచయం పెంచుకుని చనువుగా ఉండేవాడు. ఈ క్రమంలో రూ.50 వేలు అవసరం ఉంది, సర్దుబాటు చేయాలని కాటమయ్యను విశ్వనాథ్ అడిగాడు. దీంతో ముదిగుబ్బకు రమ్మని కాటమయ్య చెప్పాడు. ముందస్తు పథకం ప్రకారం కాటమయ్య, మరో ఇద్దరు ఆటో డ్రైవర్లు కమతం రామకృష్ణ, సాకే మధుబాబులతో కలిసి మృతుడు విశ్వనాథ్‌ను ముదిగుబ్బ శివారు అటవీ ప్రాంతంలోకి మద్యం సేవించడానికి తీసుకెళ్లారు. అక్కడ విశ్వనాథ్‌ను కొడవళ్లతో నరికి హత్య చేశారు. తల మొండెం వేరు చేసి పారేసి వచ్చిన ఆటోలోనే పారిపోయినట్లు డీఎస్పీ వివరించారు.

అయ్యో.. పాపం..!

బీటీపీలో మునిగి బావబామ్మర్ది మృతి

సరదాగా చేపల వేటకెళ్లగా ప్రమాదం

కుటుంబంలో విషాదం


జబీవుల్లా


మన్సూర్

గుమ్మఘట్ట, జూలై 11(ఆంధ్రజ్యోతి): చేపల వేట సరదా బావబామ్మర్దిని బలిగొంది. మండలంలోని భైరవానితిప్ప ప్రాజెక్టు (బీటీపీ)లో మునిగి జబీవుల్లా(30), మన్సూర్ (38) శుక్రవారం మరణించారు. గుమ్మఘట్ట ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకలోని మొలకల్మూరు తాలూకా రాంపురం గ్రా మానికి చెందిన జబీవుల్లా కార్పెంటర్. అతడికి రాయదుర్గం పట్టణానికి చెందిన గుల్జార్‌బానుతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. నెల రోజుల క్రితమే గుల్జార్‌బాను మగ బిడ్డకు జన్మనిచ్చింది. కుటుంబంలో సంతోషం నెలకొంది. గుల్జార్‌బాను పుట్టింట్లోనే ఉంది. ఈ నేపథ్యంలో జబీవుల్లా వారం రోజుల క్రితం మొహర్రం పండుగకు రాయదుర్గానికి వచ్చాడు. రాయదుర్గానికే చెందిన బామ్మర్ది మన్సూర్‌తో కలిసి బైక్‌పై శుక్రవారం సరదాగా బీటీపీలోకి చేపల వేటకు వెళ్లాడు. డ్యాం డిస్ట్రిబ్యూటరీ వద్ద గేలం వేస్తుండగా.. ప్రమాదవశాత్తు ఇద్దరూ నీటిలో పడిపోయారు. ఈత రాకపోవడంతో ఊపిరాడక మరణించారు. కాసేపటికి అటుగా వెళ్లిన మత్స్యకారులు.. గట్టుపై బైక్, చెప్పులు ఉండడాన్ని గుర్తించారు. మనుషులెవరూ కనిపించలేదు. అనుమానం వచ్చి వల విసిరారు. ఒకరి మృతదేహం లభించింది. వెంటనే వారు.. పోలీసులకు సమాచారం అందించారు. సిబ్బందితో కలిసి ఎస్ఐ ఈశ్వరయ్య ప్రమాద స్థలానికి చేరుకుని, పరిశీలించారు. మరోసారి వల వేయగా.. మరో మృతదేహం బయటపడింది. వారి జేబుల్లోని ఆధార్ కార్డులోని వివరాల మేరకు కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహాలను రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, మన్సూర్ బేల్దారి పనులకు వెళ్తుండేవాడు. అతడికి భార్య తబ్, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు మృతిచెందడంతో బంధువులు, కుటుంబసభ్యులు ఆసుపత్రి వద్ద బోరున విలపించారు.

దేవాలయ భూములను పరిరక్షించండి

జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దేవాలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి భూసంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో దాదాపు 2,903 ఎకరాల వరకు దేవాలయ భూములు ఆక్రమణలో ఉన్నాయన్నారు. వాటిని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని దేవాలయాల భూములను లీజుకిచ్చేలా చూడాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరెడ్డి, డీఆర్వో మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డెంగీతో బాలింత మృతి

అనంతపురం వైద్యం, గార్లదిన్నె జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరుకు చెందిన రెండు నెలల బాలింత షేక్ చాందిని(23) డెంగీతో శుక్రవారం మృతిచెందింది. ఆమె కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుక్కరాయసముద్రం మండలం పి.కొత్తపల్లికి చెందిన షేక్ చాందినికి ఏడాదిన్నర క్రితం కల్లూరు వాసి షేక్ సాదిక్‌తో వివాహమైంది. వీరికి రెండుల నెలల బాబు ఉన్నాడు. ఈనెల 6న చాందినికి జ్వరం రావడంతో పామిడి ప్రభుత్వాస్పత్రిలో చూపించారు. తర్వాత అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ రక్తపరీక్షలు నిర్వహించి, డెంగీగా నిర్ధారించిన డాక్టర్లు రెండు రోజులపాటు చికిత్సలు అందించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మధ్యాహ్నం చాందిని మృతిచెందింది. ఆమె భర్త సాదిక్ కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. చాందిని మృతితో రెండు నెలల పసివాడు.. తల్లిలేని వాడయ్యాడు.

కళ్లలో కారం చల్లి.. కత్తితో నరికేశాడు

తన భార్యతో చనువుగా ఉన్నాడని చంపేసిన భర్త


నవీన్ (ఫైల్)

కదిరి అర్బన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవారిపల్లిలో నవీన్ (36) అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన విశ్వనాథ్ హత్య చేశాడు. బహిర్భూమి కోసం శుక్రవారం తెల్లవారుజామున గ్రామ శివారుకు వెళ్లిన నవీన్‌ను వెంబడించి, కళ్లలో కారం చల్లి.. కత్తితో నరికేశాడు. పోలీసులు తెలిపిన మేరకు, విశ్వనాథ్ భార్యతో నవీన్ చనువుగా ఉండేవాడు. ఆమెకు సెల్‌ఫోన్‌లో మెసేజ్‌లు పెట్టేవాడు. దీంతో అనుమానం పెంచుకున్న విశ్వనాథ్.. ఈ హత్య చేశాడు. నవీన్ భార్య మూడేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు సాయి, పూజిత, కుమారుడు హర్షవర్ధన్ ఉన్నారు. కూతుళ్లు కదిరి కేజీబీవీలో, కుమారుడు అదే గ్రామంలో చదువుతున్నారు. తల్లి లేని చిన్నారులు.. ఈ హత్యతో తండ్రిని కూడా కోల్పోయారు. తండ్రి మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. హతుడి తండ్రి రాఘవయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కదిరి అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చార్జీలు తగ్గాయ్..

ఆర్టీసీ వెన్నెల, ఇంద్ర బస్సుల టిక్కెట్ రేట్ల తగ్గింపు: ఆర్ఎం

అనంతపురం టౌన్, జూలై11(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఆర్టీసీ వెన్నెల ఏసీ స్లీపర్, ఇంద్ర బస్సుల్లో టిక్కెట్ ధరలను తగ్గించినట్లు రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు. ఏసీ వెన్నెల స్లీపర్ బస్సుల్లో 20శాతం, ఇంద్ర బస్సుల్లో 15 శాతం టిక్కెట్ ధరలు తగ్గించామన్నారు. కొత్త ధరలు ఈనెల 31 వరకు అమలులో ఉంటాయన్నారు.

రూట్ల వారీగా తగ్గించిన ధరల వివరాలు

రూట్	ప్రస్తుత టికెట్ ధర	తగ్గింపు టికెట్ ధర
తాడిపత్రి - హైదరాబాద్ (వెన్నెల)	1105	884
అనంతపురం - విజయవాడ (ఇంద్ర)	961	817
అనంతపురం - చెన్నై (ఇంద్ర)	832	708
అనంతపురం - తిరుపతి (ఇంద్ర)	579	493

నెల్లూరుకు భారీ విజయం

గెలుపు బాటలో అనంత జట్టు... ఉత్సాహంగా మల్టీ డే క్రికెట్ పోటీలు


కమిల్


సుబ్రహ్మణ్యం


మాధవ్‌నాయుడు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని అనంత క్రీడా గ్రామంలో జరుగుతున్న సీనియర్ మల్టీ డే క్రికెట్ పోటీలలో అనంత జట్టు గెలుపు బాటలో ఉంది. నెల్లూరు జట్టు ఇన్నింగ్స్ 59 పరుగుల తేడాతో చిత్తూరు జట్టుపై విజయం సాధించింది. నాలుగో రౌండ్ పోటీసులు శుక్రవారం రెండోరోజు కొనసాగాయి. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో అనంతపురం-కర్నూలు జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 54 ఓవర్లలో 267 పరుగులకు ఆలౌట్ అయ్యింది. కర్నూలు మొదటి ఇన్నింగ్స్ 109/4తో రెండో రోజు బ్యాటింగ్ కొనసాగించి.. 49.3 ఓవర్లలో 178 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంత బౌలర్లు కమిల్ 5 వికెట్లు, వినయ్‌కుమార్ 3, ప్రమోద్‌కుమార్ 2 వికెట్లు తీశారు. రెండో ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 45.5 ఓవర్లలో 204 పరుగులకు ఆలౌట్ అయ్యింది. గిరినాథ్ రెడ్డి 54 పరుగులు, రాజు కుళ్ళాయప్ప 49 పరుగులు సాధించారు. కర్నూలు బౌలర్లు ఆంజనేయులు 6 వికెట్లు, ఇస్మాయిల్ 2 వికెట్లు తీశారు. అనంతరం 293 పరుగల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కర్నూలు, రెండో రోజు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. అనంత జట్టు మరో ఐదు వికెట్లు తీస్తే విజయం సొంతమౌతుంది.

సుబ్రహ్మణ్యం భారీ సెంచరీ..

అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో చిత్తూరు-నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు 23.3 ఓవర్లలో 124 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఓవర్‌నైట్ స్కోర్ 215/4తో రెండో రోజు ప్రారంభించిన నెల్లూరు జట్టు.. 83.1 ఓవర్లలో 413 పరుగులకు ఆలౌట్ అయ్యింది. మొదటి రోజు రేవంత్ రెడ్డి సెంచరీ చేయగా, రెండో రోజు సుబ్రమణ్యం 216 బంతుల్లో 21 బౌండరీలు, రెండు సిక్సర్లతో 160 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్ మాధవ్ రాయుడు 5 వికెట్లు, దీపన్ సాయినాథ్, సూర్యచరణ్ చెరో 2 వికెట్లు తీశారు. రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన చిత్తూరు, రెండో రోజు 49.2 ఓవర్లలో 230 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో నెల్లూరు జట్టు ఇన్నింగ్స్ 59 పరుగుల తేడాతో విజయం సొంతం చేసుకుంది. అనంతపురం జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డి పోటీలను పర్యవేక్షించారు.

అక్రమార్కులపై కొరడా

ఏడీసీసీ బ్యాంకు ఆత్మకూరు శాఖలో అవినీతిపై చర్యలు

నలుగురు అధికారుల సస్పెన్షన్... ఒకరికి షోకాజ్ నోటీసు

బోర్డు పాలకవర్గ సమావేశంలో తీర్మానం


అధికారులతో చర్చిస్తున్న ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్ కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): అక్రమార్కులపై ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి కొరడా ఝులిపించారు. ఆత్మకూరు బ్రాంచ్‌లో బోగస్ పట్టాలతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి రూ.20లక్షల రుణాలు చెల్లించిన వ్యవహారంలో నలుగురు అధికారులపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన బోర్డు పాలకవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఆత్మకూరు బ్రాంచ్‌లో 2016లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి రూ.20లక్షలు బోగస్ పట్టాలపై రుణాలిచ్చారు. ఇందులో కీలకంగా వ్యవహరించిన మేనేజర్‌స్థాయి అధికారులు రాజేంద్రప్రసాద్, నరసింహమూర్తి, నాగార్జున, సూపర్‌వైజర్ అరుణకుమారిని సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఏజీఎం స్థాయి అధికారి డీకే దుర్గాప్రసాద్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ... తీవ్రస్థాయిలో మందలించారు. ఈ వ్యవహారంలో మరో ఇద్దరు ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న ఉన్నతాధికారులను కూడా హెచ్చరించినట్లు సమాచారం. వంక పోరంబోకు స్థలానికి బోగస్ పట్టాలతో రూ.20 లక్షలు చెల్లించిన రుణాలు ప్రస్తుతం రూ.50లక్షల వరకు అయినట్లు చెబుతున్నారు. ఇలాంటి ఘటనలు బ్యాంకులో, సొసైటీల్లో పునరావృతం కాకుండా కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదని తీర్మానించారు. బ్యాంకు ప్రతిష్టను కాపాడుతూ, రైతులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంపైనే పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని ఛైర్మన్.. అధికారులకు సూచించారు. సమావేశంలో ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖారాణి, ఆప్కాబ్ నోడల్ అధికారి సురేంద్ర, రెండు జిల్లాల సహకార శాఖాధికారులు అరుణకుమార్, కృష్ణానాయక్, నాబార్డు డీడీఎం అనురాధ పాల్గొన్నారు.

15 నుంచి గ్రామ సభలు

అనంతపురం న్యూటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈనెల 15 నుంచి 25వతేదీ వరకు గ్రామసభలు నిర్వహించాలని జడ్పీ సీఈఓ శివశంకర్.. ఎంపీడీఓలను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామసభల్లో ఇప్పటికే గుర్తించిన బంగారు కుటుంబాలకు సంబంధించిన జాబితాను పరిశీలించాలన్నారు. వ్యత్యాసాలు ఉంటే సరిదిద్దాలని ఆదేశించారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన

- సుపరిపాలనలో తొలి అడుగులో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ


ఇల్లూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే. ఎంపీ

గార్లదిన్నె, జూలై 11(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మండలంలోని ఇల్లూరు గ్రామంలో శుక్రవారం వారు సుపరిపాలనలో తొలి అడుగు కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ ఏడాది పాలనలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక ఏడాదిలోనే అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారన్నారు. సుపరిపాలన ఆయనతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాసరెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఇల్లూరు రామాంజి, పాండు,సుంక,వన్నూరు,పుల్లన్న,బాబయ్య,అంజి తదితరులు పాల్గొన్నారు.

●బుక్కరాయసముద్రం: మండలంలోని పసూలూరులో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఏడాది పాలనలో జరిగిన సంక్షేమాన్ని, అభివృద్ధిని వివరించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామంలోని ఎస్సీ కాలనీలో తాగు నీటి సమస్య పరిష్కారం కోసం రూ.8లక్షల వ్యయంతో నీటిపైప్‌లైన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి రామలింగారెడ్డి, నాయకుడు పసువుల శ్రీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీకౌన్సెలింగ్ వద్దంటూ ఏఎన్ఎంల ఆందోళన


కలెక్టరేట్‌వద్ద ఆందోళన చేస్తున్న ఏఎన్ఎంలు, ఏఐటీయూసీ నాయకులు

అనంతపురం విద్య, జూలై 11(ఆంధ్రజ్యోతి): బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించి ఆర్డర్లు ఇవ్వకుండా మళ్లీ రీకౌన్సెలింగ్ చేపడతామనడం అన్యాయమంటూ ఏఎన్ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వందలాదిమంది ఏఎన్ఎంలు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆందోళన కొనసాగించారు. ఆసమయంలో కలెక్టర్ వినోద్ కుమార్ రావడంతో ఆయన వద్దకు వెళ్లి తమకు జరుగుతున్న అన్యాయం గురించి వివరించారు. కలెక్టర్ నుంచి సరైన సమాధానం రాకపోవడంతో వైద్యశాఖామంత్రి ధర్మవరంలో ఉన్నారని అక్కడకు బయలు దేరి వెళ్లారు. ఈసంద ర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ కౌన్సెలింగ్ చేపట్టి బదిలీలు చేసి ఆర్డర్లు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. కొంతమందిని వారికి అవసరమైన చోట సర్దుబాటు చేయడానికే రీకౌన్సెలింగ్ పెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. తొలుత నిర్వహించిన కౌన్సెలింగ్ మేరకే ఏఎన్ఎంలకు బదిలీ ఆర్డర్లు ఇవ్వాలన్నారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు రాజేస్‌గౌడు, కృష్ణుడు, ఏఎన్ఎంల సంఘం జిల్లాకార్యదర్శి రజని తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ప్రశంసలు

అనంతపురం విద్య, జూలై 11(ఆంధ్రజ్యోతి): మెగా పీటీఎం అనంత జిల్లాలో సక్సెస్ కావడంపై కలెక్టర్ వినోద్‌కుమార్ ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇతర జిల్లాల కన్నా అత్యధిక పాఠశాలలో అనంత జిల్లాలోనే పీటీఎం వేడుకలు జరిగాయి. దీంతో కలెక్టరు శుక్రవారం జిల్లా విద్యాశాఖాదికారి ప్రసాద్‌బాబు, ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజను వెరీగుడ్ అంటూ అభినందిస్తూ వారి ఫోన్‌లకు మెసేజ్ పంపి ప్రశంసించారు.

గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి

అనంతపురం రూరల్, జూలై11(ఆంధ్రజ్యోతి):మండలంలోని నరసనాయనికుంట టీడీపీ సీనియర్ నేత తిరుపాలు గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, సత్యసాయి జిల్లా కుమ్మర శాలివాహన కన్వీనర్ రామాంజినేయులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రవీంద్ర, రాప్తాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ అనిల్ చౌదరి, నాయకులు గంగాధర్, రాజగోపాల్, జగదీష్ తదితరులు గ్రామానికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

గర్భిణులకు అన్నదానం

రాప్తాడు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు అన్నదానం నిర్వహించారు. చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన 50 మంది గర్భిణులకు తొలుత బీపీ, షుగర్, హెచ్‌బీ, యూరిన్ తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. వైద్యాధికారి శివకృష్ణ, సీహెచ్ఓ శివప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి మృతి

అనంతపురం క్రైం, జూలై 11(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు .. ఉమానగర్‌కు చెందిన రాజన్న(68) శుక్రవారం ఉదయం 9:50 గంటల సమయంలో వ్యక్తిగత పనిపై వెళ్తుండగా రఘువీరా టవర్స్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో చికిత్స నిమిత్తం జిల్లా సర్వజనాసుపత్రికి తరలించారు అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందారు. ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల వేలం

అనంతపురం క్రైం,జూలై 11(ఆంధ్రజ్యోతి) : అనంతపురం ఎక్సైజ్ స్టేషన్ లో శుక్రవారం 8 వాహనాలకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, ఇతర అధికారుల ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఎనిమిది వాహనాలను రూ. 97,400కు విక్రయించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ జయనాథరెడ్డి, ఎస్ఐలు జయనరసింహ, జాకీర్ హుస్సేన్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ కాలనీలో అగ్నిప్రమాదం

అనంతపురం క్రైం,జూలై 11(ఆంధ్రజ్యోతి) : నగరంలోని రెవెన్యూ కాలనీలో శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అక్కడి పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో భారతి, వీర మోహన్ దంపతులు నివాసం ఉంటున్నారు. మోహన్ ఒక బీమా కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. భారతి చిన్న షాపులో చీరలు, ఇతర మెటీరియల్ పెట్టుకుని టైలరింగ్ చేస్తోంది. అయితే ఉదయం 10:30 గంటలప్పుడు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ క్రమంలో షాప్‌లోని చీరలు, ఇతర మెటీరియల్ కుట్టు మిషన్లు దగ్ధమయ్యాయి. భారతి అప్రమత్తమై నీళ్లు చల్లి మంటలు ఆర్పే లోపు చాలా వరకూ కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు చేరుకుని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. 4 కుట్టు మిషన్లు, రూ. 80వేల వరకూ డ్రాక్వా సంఘానికి చెందిన నగదు, మూడు గ్రూపులకు సంబంధించిన డ్రాక్వా రికార్డులు, రూ. 80 వేల విలువైన ఇతర మెటీరియల్ దగ్ధమైనట్టు తెలుస్తోంది. బాధితుల ఫిర్యాదు మేరకు రూ. 2.70 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు అగ్నిమాపకశాఖాధికారులు తెలిపారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారం

- తోపుదుర్తి, గొరిదిండ్ల గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు
- త్వరలోనే ప్రారంభం
- కూటమి ప్రభుత్వంలో రైతులకు ఊరట


తోపుదుర్తిలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

ఆత్మకూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తోపుదుర్తి, గొరిదిండ్ల గ్రామాల రైతులకు లోఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడే రోజులు ఇక పోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ఎమ్మెల్యే పరిటాల సునీత ఇచ్చిన హామీ మేరకు ఆయా గ్రామాల్లో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఏడాదిలోనే రెండు సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు. త్వరలోనే ప్రారంభం కూడా చేపట్టనున్నారు. దీంతో రైతులకు ఇక లోవోల్టేజీ సమస్య తీరినట్లయింది. గొరిదిండ్ల గ్రామపరిధిలో సుమారు 15వందల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. తోపుదుర్తి పరిధిలో వెయ్యి కనెక్షన్లు ఉన్నాయి. ఇదివరకు ట్రాన్స్‌ఫార్మర్లకు లోడ్‌ఎక్కువై లోవోల్టేజీ సమస్య అధికంగా వస్తుండేది. గత వైసీపీ పాలనలో రైతులు పడిన లోవోల్టేజీ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఇప్పుడు కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణంతో ఆయా రైతులకు సమస్య తీరింది. కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే వాటిని తీర్చేసింది. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సొంత గ్రామమైన తోపుదుర్తిలో కేవలం నాలుగు నెలల్లోనే సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. దీంతో ఆ గ్రామ రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇప్పటిదాకా లోఓల్టేజీతో పంటలు సరిగా పండించుకోలేక తీవ్రంగా నష్టపోయిన తాము ఇక సంతోషంగా పంటలు పండించుకోవచ్చని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గొరిదిండ్ల సబ్‌స్టేషన్ నిర్మాణంతో ఆత్మకూరు రైతులకు కూడా మరింత నాణ్యమైన విద్యుత్ అందించడానికి అవకాశం ఉందని అధికారులు తెలుపుతున్నారు.

లో ఓల్టేజీ సమస్య తీరనుంది..

ఆత్మకూరు సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా వస్తుండటంతో చాలా ఇబ్బంది పడ్డాం. ప్రస్తుతం కొత్త సబ్‌స్టేషన్ ఏర్పాటుతో సమస్య తీరింది. లోఓల్టేజీతో ఎ న్నోసార్లు మోటార్లు కాలిపోయి ఇబ్బంది పడ్డాం. ఇక ఆ సమస్య తీరింది. ఎమ్మెల్యే పరిటాల సునీతకు రుణపడి ఉంటాం.

- కుళ్లాయప్ప, గొరిదిండ్ల

సబ్‌స్టేషన్ నిర్మాణం సంతోషకరం..



తోపుదుర్తిలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపటడం ఎంతో సంతోషంగా ఉంది. ఇదివరకు లోవోల్టేజీ తో, విద్యుత్ సరఫరాలోని అంతరాయాలతో నిద్రాహారాలు లేకుండా గడిపాం. ప్రస్తుతం సబ్‌స్టేషన్ వల్ల సమస్య తీరింది.

-రాజేష్, తోపుదుర్తి

పంచాయతీల పురోగతిపై శిక్షణ

రాప్తాడు, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీల పురోగతిపై శిక్షణ జరిగింది. ఇందులో ఎంపీడీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయడంలో అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. డిప్యూటీ ఎంపీడీఓ ఆనంద్‌ప్రసాద్, వెలుగు ఏపీఎం అనిత, సీహెచ్ఓ శివప్రసాద్, మండల వ్యవసాయాధికారి కృష్ణచైతన్య, పీఆర్ జేఈ కిషోర్‌కుమార్, అంగన్వాడీ సూపర్వైజర్ నాగరత్న, పంచాయితీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అనంతపురం రూరల్: నగరంలో గల రూరల్ మండల ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీల పురోగతిపై శిక్షణ ఇచ్చారు. ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. డిప్యూటీ ఎంపీడీఓ వెంకటనాయుడు, పీఆర్ జేఈ శేషయ్య, ఏఓ శ్రీనివాసులు, ఏపీఓ నాంచారమ్మ, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యాసంస్థల దోపిడీపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం విద్య/క్లాక్‌టవర్, జూలై 11(ఆంధ్రజ్యోతి) ఉమ్మడి అనంత జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ అధ్యక్షుడు అమర్‌యాదవ్ డిమాండ్ చేశారు. నగరంలోని జేఏసీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయలను ఫీజులు రూపంలో వసూలు చేస్తున్నాయని, అలాగే ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ పుస్తకాలు, యూనిఫాం, మెటీరియల్‌ను యథేచ్ఛగా అమ్ముతూ వ్యాపారం చేస్తున్నాయని, అన్నీ తెలిసినా విద్యాశాఖ అధికారులు మౌనంగా ఉంటుండడం దుర్మార్గమని అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు అధికారులు కొమ్ము కాస్తుండడం వల్లే వారి ఆగడాలు విపరీతంగా పెరిగిపోయాయని ఆరోపించారు. ఇప్పటికైనా అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పి.యాలేరు సొసైటీ అధ్యక్షుడిగా కృష్ణమోహన్ చౌదరి



ఆత్మకూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీ.యాలేరు సొసైటీ అధ్యక్షుడిగా వడ్డుపల్లికి చెందిన గడిపూటి కృష్ణమోహన్ చౌదరిని నియమించినట్లు తెలిసింది. పీ.యాలేరు సొసైటీ ఏర్పాటైన పుటి నుంచి అధ్యక్షుడిగా ఒక్కసారి మాత్రం ఆత్మకూరు గ్రామానికి చెందిన చంద్రశేఖర రెడ్డి పని చేశారు. అత్యధికంగా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తండ్రి ఆత్మారామిరెడ్డి కొనసాగారు. ఇప్పుడు కృష్ణమోహన్ చౌదరిని ఎంపిక చేసినట్లు తెలిసింది. ఇక దీనిపై అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. ఆయన గతంలో టీడీపీ మండల అధ్యక్షుడిగా, క్లస్టర్ ఇన్‌చార్జిగా పనిచేశారు. అతడి భార్య ఎంపీటీసీ సభ్యురాలిగా పని చేశారు.

దామాజిపల్లి సొసైటీ చైర్మన్‌గా నరసింహులు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని దామాజిపల్లి సొసైటీ చైర్మన్‌గా నరసింహులును నియతులయ్యారు. ఇక్కడ గతంలో ఉన్న కమిటీ రద్దుకావడంతో కొత్తకమిటీని నియమించినట్టు పీఏసీఎస్ అధికారులు తెలిపారు. ముష్టికోవెలకు చెందిన నరసింహులును చైర్మన్‌గాను సభ్యులుగా రామస్వామి, నేలకోటప్పలను ఎంపిక చేశారు.

● కనగానపల్లి: కనగానపల్లి సొసైటీ చైర్మన్‌గా నెట్టెం వెంకటేశులు నియమితులయ్యారు. సభ్యులుగా రామకృష్ణ,దేవరాజ్‌లు నియమితులైనట్లు తెలిసింది. నెట్టెం వెంకటేశులు ఇదివరకే డీసీఎంస్ చైర్మన్‌గా ఎన్నికైన విషయం తెలిసిందే.

నూతన పాలసీతో క్రీడలకు మహర్దశ


మాట్లాడుతున్న శాప్ డైరెక్టర్ బొమ్మినేని శివ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకొచ్చిన నూతన క్రీడాపాలసీతో అటు క్రీడాకారులకు, ఇటు క్రీడలకు మహర్దశ ఏర్పడిందని శాప్ డైరెక్టర్ బొమ్మినేని శివ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కడపలోని వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాలకు శుక్రవారం నగరంలోని నీలం సంజీవ రెడ్డి పీటీసీ స్టేడియంలో జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించారు. 4, 5వతరగతుల్లో ప్రవే శాలకు గాను ఇది వరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న 24మంది క్రీడాకారులకు వివిధ క్రీడాంశాలలో పోటీలు నిర్వహించారు. నూతన క్రీడా పాలసీతో క్రీడాకారులకు రిజర్వేషన్ శాతం పెరిగి విద్య, ఉద్యోగాలలో ఉన్నత అవకాశాలు లభిస్తాయని బొమ్మినేని శివ తెలిపారు. కార్యక్రమంలో డీఎస్ఏ సూపరిండెంట్ దేవమణి, విశ్రాంత డీఎస్‌డీఓ వెంకటరమణ, శాప్ కోచ్‌లు అనిల్‌కుమార్, జెబీవుల్లా, రాఘవేంద్ర, మంజుల, సంధ్య, లక్ష్మి, సుచీంద్ర తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ కళాశాలకు సైకిళ్ల వితరణ


సైకిళ్లను తొక్కుతున్న వీసీ, రిజిస్ట్రార్

అనంతపురం రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ముంబయికి చెందిన యూనియన్ బ్యాంకు సోషియల్ ఫౌండేషన్ ట్రస్టు వారు 30సైకిళ్లను జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు వితరణ చేశారు. వీసీ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య చేతుల మీదుగా శుక్రవారం కళాశాలకు అందజేశారు. అనంతరం వీసీ, రిజిస్ట్రార్ సైకిళ్ల తొక్కారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు సైకిల్ తొక్కాలన్నారు. సైకిల్ తొక్కడం వ్యాయామం లాంటిదన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు రీజినల్ హెడ్ జితేంద్రకుమార్‌మిశ్రా, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, బ్యాంకు డిప్యూటీ రీజనల్ హెడ్ శ్రీనివాస సరోజ్‌ఠాకూర్, చీఫ్‌మేనేజర్ శ్రీహరి, మేనేజర్ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో ఉన్న కండెక్టర్‌పై దాడి

● పోలీసులకు ఫిర్యాదు

కనగానపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ధర్మవరం డిపోలో కండెక్టర్‌గా పని చేస్తున్న ముత్యాలమ్మపై మండలంలోని శివపురానికి చెందిన ఓ ప్రయాణికుడు దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితురాలు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ధర్మవరం నుంచి పేరూరుకు వెళ్తున్న బస్సులోకి కనగానపల్లి మండలం శివపురం వద్ద ఓ ప్రయాణికుడు ఎక్కాడు. అతడి వద్దకు వెళ్లి టికెట్ అడగ్గా రూ.50 ఇచ్చాడు. కండెక్టర్ టికెట్‌తో పాటు మిగిలిన చిల్లరను ఇస్తుండగా.. అతడు ఆమె చేయి పట్టుకుని అనుచితంగా ప్రవర్తించి కొట్టాడు. దీంతో తోటి ప్రయాణికులు అతన్ని మందలించారు. గతంలో కూడా పలువురి కండక్టర్ల పట్ల అతను అలాగే ప్రవర్తించినట్లు తెలిసింది. పోలీసులు ఆ ప్రయాణికుడిపై చర్యలు తీసుకోవాలని బాధిత కండెక్టర్ కనగానపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురం టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ని తపోవనం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మునిరాజు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 33కేవీ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు. కనుక తపోవనం సబ్‌స్టేషన్ పరిధిలోని జనశక్తినగర్, ప్రశాంతినగర్, సోమనాథ్‌నగర్, యువజన కాలనీ, రజకనగర్, శాంతినగర్, తపోవనం సర్కిల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కార్మికుల సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

● రౌండ్‌టేబుల్ సమావేశంలో కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని కార్మిక, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై శుక్రవారం వారు స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి ఈనెల 12వతేదీ అర్థరాత్రి నుంచి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపడుతున్న నిరవధిక సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. సమ్మెతో రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలలో మంచినీరు, వీధి దీపాలు, అనేక రకాల సేవలు ప్రజలకు నిలిచిపోతాయన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. తక్షణమే జోక్యం చేసుకుని సమస్యలు పరిష్కరించి సమ్మెను నివారించాలన్నారు. లేని పక్షంలో ప్రభుత్వం దిగివచ్చేవరకు ఐక్యంగా పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, వైఎస్సార్‌టీయూ జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, మెడికల్ రెప్స్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ జిల్లా కార్యదర్శి లతీఫ్, ఆటో యూనియన్ నగర కార్యదర్శి శ్రీనివాసులు, ఆవాజ్ నగర అధ్యక్షుడు ఇర్ఫాన్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణ, జిల్లా గౌరవాధ్యక్షుడు గోపాల్, అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏడీసీసీబీ చైర్మన్‌ను కలిసిన సొసైటీ చైర్మన్లు


ముంటిమడుగు కేశవరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సొసైటీ చైర్మన్‌లు

రాప్తాడు, జూలై11(ఆంధ్రజ్యోతి): మరూ రు, బుక్కచెర్ల సొసైటీ చైర్మన్‌లుగా ఎంపికైన మరూరు గోపాల్, బ్రహ్మానందరెడ్డి ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డిని కలిశారు. అనంతపురం నగరంలో శుక్రవారం వారు కేశవరెడ్డిని కలిసి పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. టీడీపీ నాయకులు వెంకటేష్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

శాకంబరిగా అమ్మవారి దర్శనం



శాకంబరిగా దర్శనమిస్తున్న శారదామాత, చౌడేశ్వరిదేవి

అనంతపురం టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆషాడమాస శుక్రవారాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు ఉదయాన్నే అమ్మవార్ల మూలవిరాట్‌లకు పలు అభిషేకాలు చేశారు. అనంతరం శాకంబరి అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ముఖ్యంగా శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠం, మొదటిరోడ్డులోని చౌడేశ్వరి ఆలయం తదితర ఆలయాల్లో కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరిగా అలంకరించి పూజాది కైంకర్యాలు నిర్వహించారు. ఆయా ఆలయాల కార్యవర్గాలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఈయూ ఆవిర్భావ దినోత్సవం

అనంతపురం టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ ప్రాంతీయ కార్యదర్శి పీఎస్ ఖాన్ ఈయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆర్టీసీలో పనిచేసే కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తున్న ఘనత ఈయూదేనని తెలిపారు. ఆర్టీసీ ప్రజా రవాణాశాఖగా రూపాంతరం చెందడం వెనుక ఈయూ పోరాట ఫలితం అధికంగా ఉందన్నారు. ఈయూ నాయకులు ఓబులరత్నం, కొండయ్య, మల్లికార్జున, విశ్వనాథరెడ్డి, కల్లప్ప, డిపో అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌హెచ్‌ఆర్ ఖాన్, సోమశేఖర్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

మాటల మనిషిని కాదు.. చేతల మనిషిని

- పనులు చేసి చూపిస్తా
- 'సుపరిపాలనలో తొలి అడుగు'లో ఎమ్మెల్యే దగ్గుపాటి


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే. ఇతర నేతలు

అనంతపురం క్రైం, జూలై 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల్లాగా తాను మాటలు చెప్పే మనిషిని కాదని... పనులు చేసి చూపించే చేతల మనిషినని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. స్థానిక శ్రీనివాస్ నగర్‌లో శుక్రవారం ఆయన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, పార్టీ పరిశీలకుడు లక్ష్మీనారాయణ, ఇతర నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ ఏడాది పాలనలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఏడాది పాలనలో అనంతపురం నగరంలో రూ.118 కోట్ల వ్యయంతో ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. 30 ఏళ్ల పెండింగ్‌లో ఉన్న డంపింగ్ యార్డు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. అదే విధంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను కూడా పరిష్కరిస్తామన్నారు. ఇక నడిమివంక, మరువవంక రక్షణ గోడల పనులనూ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ నేతల్లా తాను మాటల మనిషిని కాదన్నారు. పనులు చేసి చూపిస్తానని పేర్కొన్నారు. టీడీపీ నాయకుడు కృష్ణంరఘు, రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్న, రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, కార్పొరేషన్ల డైరెక్టర్లు పీఎల్ఎన్ మూర్తి, పరమేశ్వర్, కడియాల కొండన్న, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మినరసింహ, తెలుగుయువత జిల్లాప్రధానకార్యదర్శి సుధాకర్ యాదవ్, కార్పొరేటర్ బాలాంజినేయులుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు అవకాశవాది: వైసీపీ

అనంతపురం కలెక్టరేట్, జూలై11(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో చంద్రబాబు అవకాశవాదని, నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయి ప్రతి సారీ ప్రజలను మోసం చేస్తున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి విమర్శించారు. నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో శుక్రవా రం పార్టీ అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. కార్యక్రమానికి వైసీపీ పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌రెడ్డి పాల్గొన్నారు. అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ... 2014 నుంచి 2019 వరకు సీఎంగా ఉన్న చంద్రబాబు ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. ప్రస్తుతం ఏడాది గడిచినా సూపర్ సిక్స్ అమలుకు నోచుకోలేదన్నారు. ప్రజల పక్షాన బలంగా పోరాటం చేద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ నెల 20 నుంచి ప్రతి డివిజన్‌లో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ మహమ్మద్ వసీం, పీఏసీ సభ్యుడు మహాలక్ష్మి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు విజయభాస్కర్‌రెడ్డి, సాహిత్య, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, పార్టీ నగరాధ్యక్షుడు సోమశేఖరరెడ్డి , నాయకుడు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా: ఏఐటీయూసీ


మున్సిపల్ ఆర్‌డీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ, ఇంజనీరింగ్ కార్మికులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా అని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి ప్రశ్నించారు. ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ ఆర్‌డీ కార్యాలయం ఎదుట మున్సిప్ ఇంజనీరింగ్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 123మున్సిపాలిటీలలో ఇంజనీరింగ్ కార్మికులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తూ...దుర్భర జీవితాలను గడుపుతున్నారన్నారు. పెరిగిన నిత్యావసర ధరలను దృష్టిలో ఉంచుకుని కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఇప్పటికే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ప్రభుత్వానికి కళ్లు తెరిపించేందుకు ఈనెల 15న చలో విజయవాడ నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం మున్సిపల్ ఆర్‌డీ విశ్వనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిరంజీవి, రాజేష్‌గౌడ్, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, నాయకులు వేణుగోపాల్, ప్రసాద్, శివకృ ష్ణ, నాయుడు, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి: ఏఐఎస్ఎఫ్


కలెక్టరేట్‌వద్ద ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు,విద్యార్థులు

అనంతపురం విద్య, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలసొమ్మును విడుదల చేయాలంటూ ఏఐఎస్ఎఫ్ నాయకులు పోరు సాగించారు. రాష్ట్ర కమిటీపిలుపు మేరకు శుక్రవారం నగరంలో వందలాదిమంది విద్యార్థులతో కలిసి తోపుడు బండ్లలో కూరగాయలు అమ్ముతూ వినూత్నంగా నిరసనర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌వద్దకు చేరుకొని అక్కడ రోడ్డుపై బైఠాయించి ఆందోళన కొనసాగించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏఐఎస్ఎఫ్ జాతీయకార్యదర్శి శివారెడ్డి,రాష్ట్ర సహాయకార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే పేదవిద్యార్థుల కష్టాలు తీరుస్తామని చెప్పిన కూటమి నేతలు ఏడాదైనా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కాలేజీల వాళ్లు పూర్తీగా ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటున్నారని, దీంతో డిగ్రీ,పీజీ పూర్తీచేసుకున్న విద్యార్థులు వేదన చెందుతున్నారని అన్నారు. వెంటనే రీయింబర్స్‌మెంట్ బకాయిసొమ్ము విడుదల చేయాలన్నారు. లేకపోతే చలోవిజయవాడ నిర్వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేశారు. నాయకులు హనుమంతరాయుడు, అంజనేయులు, ఉమామహేష్, వెంకటనాయక్, వంశీ, వినోద్, మౌళీ,నాని, సమీర్, రాజేష్,రాజు,పవన్,తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న చోరీలు

● తాడిపత్రి, ఉరవకొండలో పేట్రేగిపోతున్న దొంగలు

● పట్టించుకోని పోలీసులు

తాడిపత్రి/ఉరవకొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల దొంగతనాలు, చోరీలు అధికమయ్యాయి. పట్టపగలే రద్దీ ప్రదేశాలలో చోరీలు చేసి ఎంచక్కా ఉడాయిస్తున్నారు. ముఖ్యంగా తాళాలు వేసిన ఇళ్లను దుండగులు టార్గెట్ చేస్తున్నారు. వరుసగా రెండు, మూడు రోజులు ఇంటికి తాళాలు వేసి ఉంటే ఇక ఆ ఇంటిలో చోరీ జరిగినట్లే అనే స్థాయికి పరిస్థితులు చేరుకున్నాయి. ఈ వరుస చోరీలతో తాడిపత్రి, ఉరవకొండ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పోలీసులు కేసులు నమోదు చేయడమే తప్పా.. రికవరీలపైన దృష్టి సారించిన దాఖలాలు లేవు. దొంగతనాలను అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



తాడిపత్రి జయనగర్ కాలనీలోని చోరీ జరిగిన ఇంట్లో బీరువా

తాడిపత్రిలో మూడు నెలల్లో జరిగిన చోరీలను పరిశీలిస్తే..

● మేలో పట్టణంలోని కొన్ని వీధుల్లో ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన పలు బైక్‌లు, సైకిళ్ల అపహరణకు గురయ్యాయి. అంతేకాకుండా ఆటో, కార్లకు ఉన్న టైర్లను ఎత్తుకెళ్లారు. అలాగే యల్లనూరు రోడ్డులోని శివానగర్‌లో ఇంటి నిర్మాణం కోసం సురేష్‌బాబు అనే వ్యక్తి నిల్వ ఉంచుకున్న రూ.14వేలు విలువగల కడ్డీలను సైతం దుండగులు ఎత్తుకెళ్లారు. బస్టాండ్‌వద్ద వరుసగా ఐదు ఇళ్లల్లో, అంబేద్కర్‌నగర్‌లో ఒక ఇంటిలో చోరీలు జరిగాయి.

● జూన్‌లో కడప రోడ్డులోని సాయినగర్, టైలర్స్ కాలనీ, కృష్ణాపురం 7వ రోడ్డు, శ్రీనివాసపురం ఉపాధ్యాయుని ఇంటిలో పట్టపగలు బంగారు నగలు ఎత్తుకెళ్లారు. సుంకులమ్మపాలెం, శ్రీరాములపేటలో వరుసగా తాళాలు వేసిన నాలుగైదు ఇళ్లలో పట్టపగలే దొంగతనాలు జరిగాయి. సాయినగర్‌లో ఇమాంబాషా ఇంటిలోని 30 తులాల బంగారు, రూ.6 లక్షల నగదును దుండగులు దోచుకెళ్లారు.

● జూలైలో మూడుచోట్ల మహిళల మెడలో గొలుసులు లాక్కెళ్లారు.

ఆరునెలలైనా రికవరీలు శూన్యం..

ఉరవకొండలో గత డిసెంబరులో పలు చోరీలు జరిగినా.. పోలీసులు చేసిన రికవరీ శూన్యం.

● 8వ తేదీన వీరశైవ నగర్‌లో రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో 30 తులాలు వెండి వస్తువులు, నగదును ఎత్తుకెళ్లారు.

● 10వ తేదీన బళ్లారి రోడ్డులో ఒకే భవనంలో రెండు ఇళ్లలో చోరీ జరిగింది. రైల్వే ఉద్యోగి ఇంటికి తాళాలు వేసి వెళ్లగా ఇంట్లోని ఆరు తులాల బంగారు, రూ.50 వేల నగదును ఎత్తుకెళ్లారు. అదే భవనంలో టైలర్ ఇంట్లో తులం బంగారు, రూ.10 వేల నగదును చోరీ చేశారు.

● 13వ తేదీన వీరశైవ నగర్‌లో టైలర్ ఇంట్లోకి దొంగలు చొరబడి విలువైన పట్టుచీరలు, వస్తువులను అపహరించారు.

● కాగా ఈ సంవత్సరం జూన్ 30న పట్టపగలే రైతు నుంచి రూ.2.26 లక్షల నగదును దుండగులు అపహరించుకు వెళ్లారు.

పోయింది కొండంత... రికవరీ గోరంత..

దొంగతనాల కేసుల్లో పోలీసులు వ్యవహార శైలి చూస్తుంటే దొంగతనం జరిగింది కొండత... రికవరీ మాత్రం గోరంత అన్న చందంగా ఉంది. ఉన్నతాధికారులకు వచ్చిన సమాచారంతో స్థానిక పోలీసులు దాడులు చేస్తూ కొంతమేర రికవరీ చేస్తున్నారే తప్ప సొంతంగా దొంగలను పట్టుకొని రికవరీ చేసిన దాఖలాలు మచ్చుకైన కనిపించడం లేదు. రాత్రి సమయాల్లో గస్తీ తిరగడం లేదు. దొంగతనాల కేసుల్లో పురోగతి ఏమాత్రం కనిపించడం లేదు.

ప్రత్యేక టీం ఏర్పాటు చేస్తున్నాం



దొంగతనాల కట్టడికి ప్రత్యే క టీం ఏర్పాటుచేస్తున్నాం. ఇప్పటికే పలువీధుల్లో పరిశీలించడంతో పాటు అనుమానం వచ్చిన వారిని విచారించి అదుపులోకి తీసుకుంటున్నాం. చైన్‌స్నాచింగ్ జరుగుతున్న ప్రాంతాల్లో ముఖ్యంగా మహిళలు వాకింగ్ చేస్తున్న ప్రాంతాల్లోనే ఎక్కువ జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో పోలీసు నిఘాను ఉంచాం.

-రోహిత్‌కుమార్ చౌదరి, ఏఎస్పీ, తాడిపత్రి

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరా బంద్

రాయదుర్గం, జూలై 11(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను బంద్ చేస్తున్నట్లు ఏడీ శ్రీనివాసులు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

● గుంతకల్లుటౌన్ : పట్టణంలోని మార్కెట్ యార్డు, ఇండస్ట్రియల్ ఏరియా సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను బంద్ చేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ నాగేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉపాధి హామీ అవకతవకలపై విచారణ

బ్రహ్మసముద్రం, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరసముద్రంలో ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ అనంతపురం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఆ గ్రామ వాసి పెన్నప్ప ఇటీవల ఫిర్యాదు చేశాడు. కూలీలతో కాకుండా... ఎక్స్‌కవేటర్లతో ఆ పనులు చేయించారని అందులో పేర్కొన్నారు. దీంతో డ్వామా పీడీ సలీం బాషా భైరసముద్రంలో ఉపాధి హామీ పనులను శుక్రవారం పరిశీలించారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

జేఎల్‌ఎంల సమస్యలను పరిష్కరించాలి



విద్యుత్ ఈఈకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

గుత్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న గ్రేడ్-2 జేఎల్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యుత్ డివిజన్ ఇంజనీర్ పద్మనాభ పిళ్లైకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలపై పలు మార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోలేదన్నారు. 14న నల్లబ్యాడ్జీలతో నిరసన, 21న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ నాయక్, డివిజన్ అధ్యక్షుడు శరత్‌కుమార్, సురేష్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం

గుత్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): రైల్వే ఇనిస్టిట్యూట్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. గుత్తి ఆర్‌ఎస్‌లో రైల్వే డీజిల్ షెడ్‌లో టీ విరామ సమయంలో శుక్రవారం స్థానిక క్యాంటిన్ వద్ద మజ్దూరు యూనియన్ ఏడీఎస్ నారాయణ, రైల్వే డీజిల్ షెడ్ బ్రాంచ్ సెక్రెటరీ రామాంజినేయుల రెడ్డి, ఓపెన్ లైన్ బ్రాంచ్ సెక్రెటరీ శేఖర్ బాబు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈనెల 15న జరగబోయే రైల్వే ఇనిస్టిట్యూట్ ఎన్నికలలో మజ్దూర్ యూనియన్ బలపరిచిన 9మందిని గెలపించాలని కోరారు.

తమలపాకు రైతులను ఆదుకోవాలి



పంటను పరిశీలిస్తున్న నాయకులు

పెద్దవడుగూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టిపాడు రైతులు సాగుచేసిన తమలపాకులు పొలాలను రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడుయాదవ్, సీనియర్ నాయకుడు సూర్యనారాయణరెడ్డి శుక్రవారం పరిశీలించారు. తమలపాకులకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని, పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరారు. వారి వెంట నాయకులు అల్లాబకాష్, రంగనాయకులు, రైతులు ఉన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

విడపనకల్లు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో జడ్పీ సీఈఓ శివశంకర్ శుక్రవారం పర్యటించారు. పొలికి గ్రామంలో పారిశుధ్యం పనులను, చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. విడపనకల్లులోని చెత్త సంపద తయారి కేంద్రాన్నీ పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ షకీలాబేగం, ఈఓఆర్డీ సత్యబాబు, ఏఓ భాస్కర్‌బాబు, కార్యదర్శులు ఎర్రిస్వామి, మునాఫ్ ఉన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

విడపనకల్లు, జూలై 11(ఆంధ్రజ్యోతి): జాతీయ డెంగీ నివారణ మాసంలో భాగంగా స్థానిక ప్రాథమిక వైద్య సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీని నిర్వహించింది. వైద్యురాలు మస్రద్‌జాహ మాట్లాడుతూ.. దోమల కాటు వల్ల అనేక రోగాలు వస్తాయని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమలను నివారించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి భత్తుల కొదండరామిరెడ్డి, సిబ్బంది కంబయ్య, అమృతలతా, తులసీ, నూర్‌బాషా, నూర్‌మహ్మద్ పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం

శెట్టూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలానికి సరఫరా చేసిన 35 క్వింటాళ్ల కందులను సచివాలయ విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు స్వాహా చేశారని రంగయ్యపాలెం రైతు గోపాల్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెల్సిందే. దీనిపై విచారణ చేపట్టి అక్రమాలపై చర్యలు చేపడతామని వ్యవసాయాధికారి వాసుకీరాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు నియామకపత్రాల అందజేత

గుంతకల్లు, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌ఎం కార్యాలయం సమీపంలో ఉన్న రైల్ క్లబ్‌లో రోజ్‌గార్ మేళాలో భాగంగా ఇదివరకే ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఎంపికైన అభ్యర్థులకు శనివారం నియామక పత్రాలను అందజేస్తారు. ఉదయం 9.30 గంటలకు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆ పత్రాలను అందజేస్తారని రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

రథంపై పంచకలశాల ప్రతిష్ఠ

విడపనకల్లు, జూలై 11(ఆంధ్రజ్యోతి): గడేకల్లులో నిర్వహిస్తున్న భీమలింగేశ్వరస్వామి రథోత్సవ వేడుకల్లో భాగంగా ఆలయం ప్రాంగణంలో పంచకలశాలకు అర్చకులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ వీధుల్లో ఊరేగించి రథంపై కళశాలను ప్రతిష్ఠించారు. ఈ కలశాలను నూతన దంపతులు దర్శించుకుంటే వారికి అంతా శుభం కలుగుతుందని నమ్మకం.

రైల్వే సహాయ మంత్రిని కలిసిన నాయకులు

రాయదుర్గం, జూలై 11(ఆంధ్రజ్యోతి): బళ్లారి నుంచి టుంకూరుకు ప్రత్యేక రైలులో వెళుతున్న కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్నను స్థానిక రైల్వేస్టేషన్‌లో బీజేపీ నాయకులు అంబోజీరావు, టీడీపీ నాయకులు జయంతి సురేష్ శుక్రవారం కలిశారు. రాయదుర్గం మీదుగా వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని, అర్థాంతరంగా ఆగిన రైల్వే ఓవర్‌బ్రిడ్జిల నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు.



మంత్రితో బీజేపీ, టీడీపీ నాయకులు

సుస్థిర అభివృద్ధిపై శిక్షణ

బొమ్మనహాళ్, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల పురోగతి సూచిక వెర్షన్ 2.0పై పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు, ఎఎన్‌ఎంలకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ దాస్ వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



ప్యాపిలి తండాలో భూమిపూజ చేస్తున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, జూలై 11(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని ప్యాపిలి తండాలో తాగునీటి సమస్యను పరిష్కరించడంలో భాగంగా పైప్‌లైన్ నిర్మాణానికి టీడీపీ నాయకులు శుక్రవారం భూమిపూజ చేశారు. గోనుగుంట్ల నాగేంద్ర మాట్లాడుతూ.. జలజీవన్ మిషన్ క్రింద రూ.8 లక్షలతో ఈ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నాగన్న, టీడీపీ నాయకులు సుంకేనాయక్, రామాంజినేయులు నాయక్, హేమ్లానాయక్ పాల్గొన్నారు.

●పట్టణంలోని ఇంద్రానగర్‌లో కల్వర్ట్ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. రూ.2లక్షలతో 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఈపనులు చేపడుతున్నట్లు టీడీపీ నాయకులు మోహన్, వీరేష్ తెలిపారు.

బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలి



డిపో మేనేజర్‌కు సమస్యను వివరిస్తున్న విద్యార్థులు

రాయదుర్గం రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నుంచి పొబ్బర్లపల్లి వరకు ఉన్న బడి బస్సులో డ్రైవర్ ఇతర ప్రయాణికులను ఎక్కించుకుంటున్నాడని, దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని గ్రామీణ విద్యార్థులు వాపోయారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక డిపో వద్ద నిరసన వ్యక్తం చేసి.. డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. బస్‌పాసులు తీసుకోని విద్యార్థులు రూ. 50, 100 నోట్లు ఇస్తే చిల్లర సరిగ్గా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ ప్రధాన కార్యదర్శి సాకే నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక హంపిరెడ్డి భవనంలో శుక్రవారం నిర్వహించిన ఆటో కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఆటో కార్మికులపై పోలీసులు, ఎంవీఓ వేధింపులు ఆపాలని అన్నారు. గూళ్లపాళ్యం గ్రామంలో ఆటో కార్మికులు 45 మంది (సీఐటీయూ) అనుబంధ భగత్‌సింగ్ ఆటో యూనియన్‌లో చేరారు. గూళ్యపాళ్యం ఆటో కార్మికులతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడిగా మల్లికార్జున, కార్యదర్శిగా శర్వానంద, అధ్యక్షుడిగా సుధాకర్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసుల యాదవ్, కోశాధికారిగా జే శ్రీనివాసులుతో పాటు 30 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

ఘనంగా ఈయూ ఆవిర్భావ దినోత్సవం

గుత్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జోనల్ అధ్యక్షుడు ఎంఆర్ ఆంజనేయులు, డిపో అధ్యక్షుడు వాసు, సెక్రెటరీ గంగేశ్వర్, నాయకులు ఎస్ఎస్ నాయక్, హుసేన్‌సాహెబ్, పీకే రాముడు, గ్యారేజ్ సెక్రెటరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ గుత్తి డిపోలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

పథకాలు అందకుంటే ఫిర్యాదు చేయండి

తాడిపత్రి, జూలై 11(ఆంధ్రజ్యోతి): అర్హులకు పథకాలు అందకుంటే తమకు ఫిర్యాదు చేయాలని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి సూచించారు. సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శ్రీనివాసపురంలో ఆయన ఇంటింటికి వెళ్లి.. పథకాలపై ఆరాతీశారు. ఆయన వెంట బాబు, ప్రసాద్, విజ్జి, ఖాదర్, పుల్లయ్య, లచ్చి ఉన్నారు.

సంక్షేమం పట్టని కూటమి: వైసీపీ



సమావేశంలో మాట్లాడుతున్న అనంత వెంకట్రామిరెడ్డి

రాయదుర్గంరూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకట్రామిరెడ్డి విమర్శించారు. మండలంలోని 74 ఉడేగోళం సమీపంలో మద్దానేశ్వరస్వామి కళ్యాణమండపంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో రాష్ట్రంలో ఏడాదిలోనే వేలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వాపోయారు. అనంతరం పార్టీ నియోజకవర్గ మండల, అనుబంధ సంఘాల కమిటీల్లో నియమితులైన వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌కమార్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

తాడిపత్రి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేనేత కార్మికులకు ప్రభుత్వాలు ఇస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చేనేత జౌళీశాఖ అధికారి వరప్రసాద్ సూచించారు. మండలంలోని చిన్నపొలమడలో చింతల వెంకటరమణస్వామి చేనేత క్లస్టర్ అభివృద్ధి పథకం సభ్యులు చిన్నపొలమడ, పెద్దపొలమడ, గన్నెవారిపల్లికాలనీ, యర్రగుంటపల్లి, అక్కన్నపల్లి గ్రామాలకు చెందిన దాదాపు 363 మందికి చేనేత కార్మికులకు రూ.1.33 కోట్ల విలువైన ముగ్గం పరికాలను లబ్ధిదారులకు మంజూరుచేశారు. వాటిని ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారని వారిని వరప్రసాద్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చేనేత జౌళీ శాఖ అభివృద్ధి అధికారి బసవరాజు, సహాయ అభివృద్ధి అధికారి మురళీ మోహన్, మాజీ సర్పంచు రవిమోహన్ పాల్గొన్నారు.

శనీశ్వరుడి సేవలో ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక శాసనసభ్యుడు గుమ్మనూరు జయరాం శుక్రవారం ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ఉత్తరకాశీలోని శనీశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఉత్తర భారతదేశ తీర్థయాత్రకు వెళ్లిన ఎమ్మెల్యే తన సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, శ్రీనివాసులు, కుటుంబ సభ్యులతో ఉత్తర కాశీలో శనేశ్వర స్వామి దేవస్థానాన్ని దర్శించుకున్నారు.



శనీశ్వరుడికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి

గుంతకల్లుటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రజలపై అధిక విద్యుత్ భారాలు మోపే ట్రూఅప్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక హంపిరెడ్డి భవన్ వద్ద శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజల వ్యతిరేకతను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్మార్ట్ మోటర్లను బిగింపు ఆపాలని, సెకి ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బీ శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, సభ్యులు జగ్గలి రమేష్, సాకే నాగరాజు, సురేంద్ర, రామునాయక్, షాషా, జాకీర్, జ్యోతి, తిమ్మప్ప పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో వాసవీమాత

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: ఆషాఢ మాసం శుక్రవారాన్ని పురస్కరించుకొని గుత్తి, గుంతకల్లు, బెళుగుప్ప, తాడిపత్రిలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం నిర్వహించారు. వాసవీ మాతను శాకంబరిగా అలంకరించారు. గుంతకల్లులో దేవరశెట్టి నాగశ్రీ, సంతోష్ కుటుంబ సభ్యులు 108 రకాల 108 రకాల పండ్లు, స్వీట్లు, సారెను ఇంటి నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు.



గుత్తి, గుంతకల్లు, బెళుగుప్ప, తాడిపత్రిలో శాకంబరీదేవి అలంకరణలో అమ్మవారు

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

కళ్యాణదుర్గం వ్యవసాయ శాఖ ఏడీ యల్లప్ప

ఇంటర్వ్యూ interview



కళ్యాణదుర్గం, జూలై 11(ఆంధ్రజ్యోతి): యాజమాన్య పద్ధతులను పాటించడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని కళ్యాణదుర్గం వ్యవసాయ శాఖ ఏడీఏ యల్లప్ప సూచించారు. భూ సార పరీక్షలు చేయించుకొని.. శాస్త్రవేత్తలు, అధికారుల సూచన మేర కే ఎరువులు వాడాలని, అధికంగా వాడితే నష్టం తప్పదన్నారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి ఆయనతో నిర్వహించిన ఇంటర్వ్యూ ఇలా సాగింది.

ప్రశ్న : వేరుశనగ పంటకాలం, రకాలు ఎంపిక ఎలా చేసుకుంటే అధిక దిగుబడులు ఆశించవచ్చు

జవాబు : వేరుశనగ ఖరీఫ్ కింద సాగుకు ఈ నెల 15 వరకు అనుకూలం. వేరుశనగలో నూతన రకాలు టీసీజీఎస్ -1694, కేఎల్ 1812వశిష్ఠ రకాలు మంచి దిగుబడులు ఇస్తున్నాయి.

ప్రశ్న: విత్తనశుద్ధి లాభాలేమిటి.. ఎలా చేయాలి

జవాబు: వేరుశనగ పంట నందు ముడ్డుకుళ్లు వైరస్ నివారణ కోసం ఇమిడాక్లోప్రైడ్ రెండు ఎంఎల్, అదేవిధంగా తెగుళ్ల నివారణకు మూడు గ్రాముల డీఎం-45 పొడి మందు కిలో విత్తనానికి కలిపి శుద్ధి చేయాలి. వేరుపురుగు ఆశించిన ప్రాంతంలో రెండు ఎంఎల్ క్లోరోపైరిఫాస్‌తో కిలో విత్తనాలను శుద్ధి చేసుకోవడం వలన పంట మొదటి నెలరోజులు తెగుళ్ల బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

ప్రశ్న: దిగుబడుల కోసం ఏ ఎరువులు వాడాలి

జవాబు: వేరుశనగ ప్రధానంగా నత్రజని స్వంతంగా తనకు తానే తయారు చేసుకుంటుంది. అందువల్ల నత్రజని ఎరువు తక్కువగా వేయాలి. ఎకరాకు 20 కిలోలు మరియు వంద కిలోల ఎస్ఎస్‌పీ, 35 కిలోల ఎంఓపీ వేసుకోవాలి. పంట పూత దశలో (నెల రోజుల) లోపు జిప్సం ఎకరాకు 200 కిలోలు వేయడం ద్వారా దిగుబడులు 20 శాతం పెరిగే అవకాశం వుంది.

ప్రశ్న : వేరుశనగలో అంతర పంటల ప్రాధాన్యత ఏమిటి

జవాబు: వేరుశనగ పంటలో అంతర పంటగా కంది 7-1 సాళ్లు వేయడం ద్వారా అధిక ఆదాయం వస్తుంది. వేరుశనగ పంట చుట్టూ నాలుగు వరుసలు జొన్న వేసుకోవడం వల్ల ద్రవరసం పీల్చు పురుగుల ఉధృతి తగ్గుతుంది. జొన్న పంట సొప్ప పశువులకు ఆహారంగా కూడా ఉపయోగపడుతుంది.

ప్రశ్న : నీటి యాజమాన్యం సున్నిత దశలు..?

జవాబు: వేరుశనగ పంట కాలంలో సుమారు 450 ఎంఎం నీటి లభ్యత కావాలి. ఒకవేళ నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు పంట సున్నిత దశలలో (అంటే దిగుబడిపై ప్రభావం చూపించే దశలు) పూత దశ, వూడుకట్టు దశ, విత్తన కాయల దశల నందు నీటి తడులు ఇచ్చినట్లయితే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి.

క్రైం న్యూస్..

విద్యుదాఘాతంతో వ్యాపారి మృతి



సందీప్ సింగ్ (ఫైల్)

రాయచూరు (కర్ణాటక), జూలై 11(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు పట్టణానికి సందీప్ సింగ్ (36) 15 ఏళ్లుగా కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా ముదగల్ పట్టణంలో మొహర్రం సందర్భంగా గోబి మంచూరీ దుకాణం నిర్వహించేందకు వెళ్లేవాడు. ఈ ఏడాది కూడా అక్కడ దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. గురువారం రాత్రి దుకాణానికి నేరుగా విద్యుత్ కనెక్షన్ ఇచ్చే సమయంలో షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని ముదగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించామని, కేసు దర్యాప్తులో ఉందని ముదగల్ ఎస్ఐ శుక్రవారం తెలిపారు.

కాంట్రాక్ట్ హెల్పర్ ఆత్మహత్యాయత్నం

గుంతకల్లుటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక 132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ హెల్పర్ అన్సర్‌బాషా శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇతను గుత్తి ఆర్టీపీఎస్ఎస్ 220కేవీ సబ్ స్టేషన్‌లో కాంట్రాక్ట్ హెల్పర్‌గా పనిచేస్తూ... మీచువల్ మీద వారం క్రితం గుంతకల్లు 132 సబ్‌స్టేషన్‌కు వచ్చాడు. శుక్రవారం గుంతకల్లు 132 కేవీ సబ్‌స్టేషన్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. గమనించిన సిబ్బంది అతన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మీచువల్ రద్దు చేసుకొని గుత్తి ఆర్టీపీఎస్ఎస్ 220కేవీ సబ్ స్టేషన్‌కే వెళ్లాలని అధికారులు ఒత్తిడి చేయడం వల్లే అన్సర్‌బాషా ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తోటి ఉద్యోగులు తెలిపారు.

ఇష్టంలేని పెళ్లి చేస్తున్నారని యువకుడు..

తాడిపత్రి, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాల్వగడ్డవీధికి చెందిన జిలాన్‌బాషా శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతను కొన్ని పెళ్లి సంబంధాలను ఒప్పుకోకపోవడంతో తండ్రి మందలించాడు. తనకు ఇష్టం లేని పెళ్లి ఎందుకు చేస్తున్నారని మనస్తాపం చెంది ఇంటిలో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. తండ్రి ఖలీల్‌బాషా ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఇరువర్గాల ఘర్షణ

యల్లనూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. కూచివారిపల్లి గ్రామానికి చెందిన రమాదేవి కుమారుడు జయ.. బొప్పేపల్లికి చెందిన కురువ నారాయణస్వామి వారం క్రితం గొడవపడ్డారు. బుధవారం మరోసారి ఇరువురు కూచివారిపల్లిలో గొడవపడ్డారు. దీన్ని మనసులో పెట్టుకొని నారాయణస్వామి మరో 12 మందితో కలిసి బుధవారం అర్ధరాత్రి జయ ఇంటిపై దాడి చేశారు. ఇంటిలోని టీవీ, గృహోపకరణాలు, వస్తువులను ధ్వంసం చేశారు. రమాదేవి ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు.

మా ట్రాక్టర్లు ఇప్పించండి

తాడిపత్రి, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలం జూటూరుకు చెందిన కాటమయ్య, నార్పల మండలం చెన్నంపల్లికి చెందిన బద్రి, పట్టణానికి చెందిన శివ వేర్వేరుగా ట్రాక్టర్లను స్థానిక సుంకులమ్మపాలెంకు చెందిన సుధాకర్‌కు లీజుకు ఇచ్చారు. నెలకు రూ.20వేలు ప్రకారం చెల్లించే విధంగా ఒప్పందం చేసుకున్నారు. రెండు నెలల నుంచి బాడుగ ఇవ్వకుండా సుధాకర్ ఇంటికి తాళాలు వేసి ఫోన్ స్విచాఫ్ చేశాడు. దీంతో బాధితులు పట్టణ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదుచేశారు. కనీసం తమ ట్రాక్టర్లు అయినా ఇప్పించాలని వేడుకున్నారు.

రోగులకు తప్పని తిప్పలు



రోగిని నడిపించుకుంటూ తీసుకువెళ్తున్న కుటుంబ సభ్యులు

తాడిపత్రి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు కనీస సౌకర్యాలూ లేవు. రోగులను తీసుకెళ్లేందుకు స్ట్రెచ్చర్, వీలు చైయిర్లు కూడా లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాడికికి చెందిన ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే ఆమెను ఎమర్జెన్సీ వార్డులోకి తీసుకువచ్చారు. అక్కడ చికిత్స నిర్వహించిన అనంతరం వార్డు షిఫ్ట్ చేయాలని సిబ్బంది ఆమె కుటుంబ సభ్యులకు సూచించారు. ఎలా తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులు అడగ్గా.. నడిపించుకుంటూ అని ఉచిత సలహా ఇచ్చారు. చేసేదేమీలేక వారు ఆమెను ఇలా నడిపించుకుంటూ మరో వార్డుకు తీసుకెళ్లారు.